చిన్నారులకు టీకాలు తప్పనిసరి

రాజమహేంద్రవరం అర్బన్, మే 21 : జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు, మాతాశిశు సంరక్షణ కార్యకర్తలు వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాలతో పాటు ఆరోగ్య కార్యక్రమాల టార్గెట్లను ప్రతినెలా నూరుశాతం పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు ఆదేశించారు.రాజమహేంద్రవరం శ్రీ వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో మంగళవారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలకిచ్చే వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు.



కృష్ణబాబు ఇక లేరు

- అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- కొవ్వూరు ఎమ్మెల్యేగా ఐదుసార్లు ఎన్నిక

కొవ్వూరు నియోజకవర్గ ప్రజలు పెద్దాయనగా పిలుచుకునే పెండ్యాల కృష్ణబాబు మృతితో తీవ్ర విషాదం నెలకొంది.. మంచి నాయకుడిని కోల్పోయాం అని రాజకీయ నాయకులు అంటుంటే.. మంచి మనిషిని కోల్పోయాం అంటూ ప్రజలు కన్నీటిపర్యంతమవుతున్నారు.. ఎన్‌టీఆర్ పిలుపుతో 1982లో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన టీడీపీ నుంచి ఐదు సార్లు కొవ్వూరు ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డు సృష్టించారు. కావడానికి దొమ్మేరు జమిందార్ అయినా ఏదైనా కష్టం వచ్చిందని ఎవరైనా వెళితే సాయం అందించేవారు.. అందుకే తిరుగులేని నేతగా ఎదిగారు.. పశ్చిమ రాజకీయాలనే శాసించే స్థాయికి చేరారు.. ఉమ్మడి పశ్చిమలో ఆయన ఎవరు పేరు చెబితే వారికే ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చేవారు.. అలా ఆయన భిక్షతో రాజకీయంగా ఎదిగిన వారు ఎందరో ఉన్నారు.. నాడు ఎన్‌టీఆర్, తరువాత చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా ఉండేవారు. ఆయన ఇకలేరని తెలిసి పశ్చిమ జిల్లాలో తీవ్ర విషాదంలో నెలకొంది. ఆయన మృతికి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, హోం మంత్రి తానేటి వనిత తీవ్ర సంతాపం తెలిపారు. - వివరాలు 7లో

నేటి నుంచి ఆరోగ్య శ్రీ సేవలు బంద్

- ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిలిచిపోనున్న వైద్యసేవలు
- బిల్లుల బకాయిలే కారణం



రాజమహేంద్రవరం అర్బన్, మే 21 : జిల్లాలో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు అందించే ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ వైద్యసేవలు నిలిచిపోనున్నాయి. చికిత్సల బిల్లు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఆరోగ్యశ్రీ వైద్య సేవలను నిలిపివేయాలని ప్రైవేట్ నెట్‌వర్కు ఆసుపత్రుల యాజమాన్యాలు నిర్ణయించినట్టు చెబుతున్నారు. కొవిడ్ - 19 చికిత్సల బిల్లులతో పాటు రెండు, మూడు సంవత్సరాలుగా ఆరోగ్యశ్రీ బిల్లులను చెల్లించకపోవడంతో బకాయిలు చెల్లించాలంటూ ప్రైవేట్ నెట్ వర్కు ఆసుపత్రుల యాజమాన్యాలు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో వైద్యసేవలను నిలుపుదల చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు రూ.100 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిసింది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్‌లో ఆరోగ్యశ్రీ నెట్ వర్కు ఆసుపత్రులు 93 ఉన్నాయి. వీటిలో 36 ఆసుపత్రులు ప్రైవేట్ నెట్ వర్కు ఆసుపత్రులుగా కొనసాగుతున్నాయి. ఈ ఆసుపత్రులన్నింటిలోనూ ఈనెల 22వ తేదీ బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ వైద్యసేవలు నిలిచిపోయే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ఆరోగ్యశ్రీ వైద్యసేవలు నిలిపివేస్తామంటూ జిల్లా ప్రైవేట్ నెట్‌వర్కు ఆసుపత్రుల యాజమాన్యాల అసోసియేషన్ నుంచి మంగళవారం రాత్రి వరకూ తమకు ఎలాంటి సమాచారం రాలేదని జిల్లా ఆరోగ్యశ్రీ అధికారి కార్యాలయం వర్గాలు చెబుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఐదేళ్లలో సుమారుగా నాలుగుసార్లు వైద్య సేవలు బంద్ చేసినట్టు సమాచారం.

పేదోడికి పప్పన్నం కరువాయె!

- పేదోళ్ల కందిపప్పుకు వైసీపీ ఎసరు
- ఐదు నెలలుగా రేషన్‌లో పంపిణీ నిల్
- మార్కెట్‌లో కేజీ రూ.175 నుంచి రూ.200
- జిల్లాలో 5.73 లక్షల కుటుంబాలకు అందలేదు



(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పేదోళ్ళ కందిపప్పుకు వైసీపీ ప్రభుత్వం గండికొట్టింది. మార్కెట్‌లో పప్పుధరలు మండిపోతున్న సమయంలో పేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసి పేద కుటుంబాల్లో పప్పులేకుండా చేసింది. ప్రస్తుతం జిల్లాలోని వివిధ మార్కెట్లలో కేజీ కందిపప్పు రూ.175 వరకూ విక్రయిస్తున్నారు. సాధారణంగా మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ఆదుకుంటుంది. కానీ వైసీపీ ప్రభుత్వం మాత్రం పేదల కడుపుకొట్టింది. గతేడాది అక్టోబరు నుంచే కందిపప్పు సరఫరా తగ్గించారు. హాస్టల్, అంగన్‌వాడీలకు కొంతవరకూ సరఫరా చేస్తున్నారు. గత డిసెంబర్‌లో జిల్లాలో కొద్ది ప్రాంతంలో మాత్రమే అడిగిన వారికి ఇచ్చేవారు. రెండు నెలల నుంచి మొత్తం ఎంఎల్ పాయింట్లన్నీ ఖాళీ. కందిపప్పు ఊసెత్తడం లేదు. డీలర్లు మాత్రం డిసెంబరు నుంచే మాకు కందిపపప్పు సరఫరా చేయడం మానేశారని చెప్పడం గమనార్హం. జిల్లాలో 5.73 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటన్నింటికీ ఒక్కో రేషన్‌కార్డుకు రూ.కేజీ వంతున కందిపప్పు అమ్మేవారు. దీని ధర రూ.67 ఉండేది. ఇది ప్రజలకు బాగా ఉపయోగపడేది. ఇవాళ మార్కెట్‌లో కందిపప్పు కొనలేక పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సూపర్ మార్కెట్లలో కేజీ పప్పు ధర రూ.200 దాటేసింది. మార్కెట్‌లో నియంత్రణ లేకపోవడం వల్ల ఎవరి ఇష్టానుసారం వారు అమ్మేస్తున్నారు. ఎన్నికల ముందు కూడా ప్రభుత్వం ప్రజలను పట్టించుకోలేదు. అధికారులు మాత్రం ఇంకా కందిపప్పు పంపిణీ చేస్తున్నామని బొంకుతున్నారు. ఎక్కడ ఎవరికి ఇస్తున్నారని ఆరా తీస్తే రెండునెలల నుంచి పప్పు అందడం లేదని ప్రజలు చెబుతున్నారు. మొత్తం మీద నెలకు జిల్లాకు 573 టన్నుల కందిపప్పు అవసరం. ఇంటింటికీ రేషన్ అని గొప్పలు చెబుతూ వైసీపీ ఒక్కొక్కటి వంతున రేషన్ తగ్గించుకుంటూ వస్తుంది. ఈ నెలలో గోధుమ పిండి ఇవ్వడంలేదు. ప్రస్తుతం బియ్యం, అరకేజీ పంచదార మాత్రమే ఇస్తున్నారు.గత తెలుగుదేశం ప్రభుత్వంలో బియ్యం, పంచదార, కందిపప్పు, వంటనూనె వంటివి ఇచ్చేవారు. ఇవాళ బియ్యం సక్రమంగా సరఫరా చేయలేని పరిస్థితి. గత నెలలో కొంతమందికే బియ్యం ఇచ్చారు. బియ్యం కోసం అనేకమంది రేషన్‌షాపులు, ఎండీయూ వాహనాల చుట్టూ తిరిగారు. కొద్ది నెలల కిందట ప్రధాని మోదీ మరో మూడేళ్ల పాటు ఉచిత బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే.వైసీపీ ప్రభుత్వం దానిని ఇప్పటి వరకూ అమలు చేయలేని పరిస్థితిలో ఉండడం గమనార్హం.

విజిట్రబుల్స్



- కూరగాయల ధరలకు రెక్కలు
- ఘాటెక్కిన పచ్చిమిర్చి
- కిలో రూ.80పైనే
- వంగ, బీర, బెండదీ ఇదే దారి
- ఎండ, వానలతో పంటకు నష్టం
- ఆకుకూరలపై తీవ్ర ప్రభావం

రాజమహేంద్రవరం అర్బన్, మే 21 : కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. ధరలు పై పైకి దూసుకెళుతున్నాయి. పచ్చిమిర్చి ఘాటెక్కి బహిరంగ మార్కెట్లో కిలో రూ.80లు దాటేసింది. ఇదే దారిలో వంకాయలు, బీరకాయలు, బెండకాయల ధరలు పరుగులు పెడుతున్నాయి. ఒక పక్క తీవ్రమైన ఎండలు, మరో పక్క గాలి వానలతో పంటలు దెబ్బతిని దిగుబడులు పడిపోతున్నాయి. రావులపాలెం సమీపంలోని మడికి, రాజమహేంద్రవరం హోల్‌సేల్ మార్కెట్లకు ఆశించినస్థాయిలో సరుకు రావడంలేదని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. రెండు వారాల కిందట వరకూ ధరలు కాస్త అదుపులోనే ఉన్నట్టు కనిపించినా కొద్దిరోజుల కిందట కురిసిన భారీ వర్షం, గాలులతో కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత కూడా వర్షాలు వెన్నాడడంతో కూరగాయల సాగుకు గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా సరుకులేక ధరలు పెరుగుతున్నాయి.

మిర్చి ఘాటు.. చిక్కుళ్లు రేటు..

బహిరంగ మార్కెట్లలో రిటైల్ వ్యాపారుల వద్ద ధరలు మండిపోతున్నాయి. ఇక్కడ పచ్చిమిర్చి కిలో రూ.80ల పైనే పలుకుతోంది. ఒకటి, రెండు రోజుల్లో రూ.100 దాటొచ్చని చెబుతున్నారు. కడప జిల్లా మైదుకూరు ప్రాంతం నుంచి వచ్చే మిర్చి దిగుమతులు తగ్గడంతో శ్రీకాకుళం, జగదల్‌పూర్ ప్రాంతాల నుంచి మిర్చి దిగుమతి చేసుకుంటున్నారు. చిక్కుళ్లు కిలో రూ.140ల ధర ఉండడం గమనార్హం. వంకాయలు దొమ్మేరు రకం రూ.60-రూ.80లు ధర ఉంది. నలుపు, తెలుపు చార, గులాబీ రకాలు కూడా కిలో రూ.60 వరకూ ఉన్నాయి. బీరకాయలు, బెండకాయల ధరలు దాదాపుగా ఇలానే ఉన్నాయి. దొండకాయల ధర మాత్రం కాస్త తక్కువగా కిలో రూ.40 ఉంది. రాజమహేంద్రవరం సమీపంలోని సీతానగరం మండలంలో పలు ప్రాంతాల్లో రైతులు బీర, బెండ, దొండసాగు కొంత వరకూ చేపడుతున్నా మార్కెట్ అవసరాలకు సరిపోవడంలేదు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి సరుకు దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. టమాటా కూడా రూ.40ల వరకూ ఉంది. లోకల్‌గా సాగుచేసే నాటు రకం సీజన్ ముగియడంతో టమాటాను మదనపల్లి నుంచి ఇక్కడ మార్కెట్లకు తెస్తున్నారు. చేమదుంపలు, క్యాప్సికం, బొబ్బర్లు, కాకరకాయలు, కంద ధరలు ఎక్కువగానే ఉన్నాయి.

ఆకు కూరలు.. మరీ దారుణం..

రాజమహేంద్రవరం, మడికి హోల్‌సేల్ మార్కెట్లలో ఆకు కూరలు పెద్దగా కనిపించడంలేదు. ప్రతికూల వాతావరణం కారణంగా మార్కెట్ అవసరాలను చాలా వరకూ తీర్చే తాళ్లపూడి మండలం పెద్దేవం ప్రాంతం నుంచి ఆకుకూరలు మార్కెట్‌కు రావడం బాగా తగ్గిపోయింది. పెద్దేవం నుంచి కొత్తిమీర అసలు రావడమేలేదు. హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లు రైతుబజార్లలో బెంగుళూరు కొత్తిమీర మాత్రమే లభ్యమవుతోంది. మెంతికూర మార్కెట్‌లో దాదాపుగా కనిపించడంలేదు. గోంగూర, తోటకూర, పొన్నగంటికూర మాత్రమే కాస్త పచ్చగా కనిపిస్తున్నాయి. చుక్కకూర, పాలకూర కాస్త వస్తున్నా ఆకుల చాలా వరకూ పాడైన స్థితిలో ఉంటున్నాయి. ఎండలు, వర్షాలకూ ఆకుకూరలన్నీ బాగా దెబ్బతినడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.వర్షాలు ఎక్కువగా పడితే కూరగాయల ధరలు ఇప్పట్లో దిగిరాకపోవచ్చని, ఆకు కూరల పరిస్థితీ ఇంతేనని రైతులు, వ్యాపారులు, మార్కెటింగ్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

విద్యార్థులు ఒత్తిడి అధిగమించేందుకే పాల్ ల్యాబ్‌లు ఏర్పాటు

ఎస్ఎస్ఏ అధికారి శ్రీనివాసులు రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ,మే 21 : పాల్ లాబ్ ద్వారా ఆదర్శవంతమైన విద్యావాతావరణం రూపొందించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష అదనపు పథక సంచాలకులు బి.శ్రీనివాసులు రెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం ట్రైనింగ్ కాలేజీలో మంగళవారం పాల్ ల్యాబ్ ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణిత, ఆంగ్ల ఉపాధ్యాయులతో ఒక రోజు శిక్షణ నిర్వహించారు. పాల్ ల్యాబ్ (పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్) లు సంప్రదాయ బోధనా విధానాల్లో కొనసాగుతున్న అభ్యాస అవాంతరాలు ఒత్తిడిని అధిగమించడమే లక్ష్యంగా ఏర్పడ్డాయన్నారు. గత విద్యా సంవత్సరంలో ఏర్పడిన లోటు పాట్లను సవరించుకొని రానున్న విద్యాసంవత్సరంలో జిల్లా స్థాయిలో పాల్ ల్యాబ్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు రెమిడియల్ టీచింగ్ ద్వారా సందేహాలు నివృత్తి చేయాలన్నారు. శిక్షణలో రాష్ట్ర కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఏడీ శ్రీనివాస్‌సింగ్, జోన్ -2 ప్రాంతీయ విద్యా సంచాలకులు బి.నాగమణి, జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె వాసుదేవరావు, జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, రాష్ట్ర పాల్ ల్యాబ్ కోఆర్డినేటర్ బి.కిషోర్, రాష్ట్ర పరిశీలకురాలు నాగమణి, జిల్లా సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు ఏఎంవో గౌరీశంకర్, సీఎంవో శ్రీనివాసరావు, ఏఎస్‌వో వైవి ప్రసాద్, డీవైఈవో ఈవిబిఎస్ నారాయణ, ఐఈ కోఆర్డినేటర్ కనకబాబు, డీఈవో కార్యాలయం ఏఎస్‌ఓ ప్రసాద్, సురేష్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల పాల్ ల్యాబ్ పాఠశాలల హెచ్ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

సుప్రీంకోర్టుకు ముప్పాళ్ల సుబ్బారావు అప్పీల్

రాజమహేంద్రవరం, మే 21(ఆంధ్రజ్యోతి) : గోదావరిలో ఇసుక అక్రమాలకు పాల్పతున్న ఇసుక మాఫియా, వారికి సహకరిస్తున్న అధికారుల మీద చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు సుప్రీంకోర్టు, హైకోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్‌తో పాటు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశించినా పట్టించుకోకపోవడాన్ని సీరియస్ పరిగణించాలని కోరారు. అఖండగోదావరిలో ఇప్పటికే అక్రమంగా జరుగుతున్న డ్రెడ్జింగ్ ఫొటోలతో పాటు కోర్టుకు ఆధారాలు అందజేసినట్టు పేర్కొన్నారు. ఇక్కడ సెబ్, రెవెన్యూ, పోలీస్,ఇరిగేషన్, మైనింగ్ తదితర శాఖల అధికారులంతా మాఫియాతో కుమ్మక్కయ్యారని వివరించారు.

కౌంటింగ్‌కు సిద్ధంకండి

- ముందస్తు కార్యాచరణ అవసరం
- బాణసంచా విక్రయాలు నిషేధించండి
- కలెక్టర్, ఆర్‌వోలతో సీఎస్ సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ, మే 21 : జిల్లాలో జూన్ 4న జరిగే కౌంటింగ్ ప్రక్రియలో లాండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కౌంటింగ్‌కు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలన్నారు. కేంద్రంలో నిరంతర విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు బాణసంచా విక్రయాలు నిషేధించాలని ఆదేశించారు. ముఖ్యంగా జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా సమన్వయ శాఖల అధికారులతో కార్యాచరణ ప్రణాళికతో చర్యలు తీసుకోవాలన్నారు.



సీఎస్ వీసీలో కలెక్టర్, ఇతర అధికారులు

జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష

జిల్లా అధికారులతో కలెక్టర్ మాధవీలత సమీక్షించారు. జూన్ 4 జరిగే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. చీఫ్ సెక్రటరీ ఆదేశాల మేరకు సున్నితత్వం కలిగిన ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. కౌంటింగ్ రోజున బాణసంచా కాల్చకుండా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం (ఎన్ఆర్ఈజీఎస్) కింద మే 2024 నాటికి 21.41 లక్షల పనిదినాలు లక్ష్యం దిశగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇప్పటి వరకు 11.21 లక్షల పనిదినాల లక్ష్యాలను సాధించామన్నారు. మే 18వ తేదీన ఉపాధి కూలీలు 48,739 మంది హాజరుకాగా రోజుకు సగటున 5,680 మందికి ఉపాధి కల్పించామన్నారు. రోజుకు సగటున వేతనం రూ.249.41 ఇస్తున్నట్టు తెలిపారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని మరింతగా పని దినాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రానున్న రోహిణి కార్తెను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ లోవోల్టేజ్ సమస్య లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.

జిల్లాలో సెక్షన్ 144,30 అమలు

- 'తూర్పు'లో విస్తృతంగా కార్డన్ సెర్చ్
- ఎస్పీ జగదీశ్ స్వీయ పర్యవేక్షణ

రాజమహేంద్రవరం, మే 21(ఆంధ్రజ్యోతి): ఓట్ల కౌంటింగ్ దగ్గర పడుతుండడంతో తూర్పుగోదావరి పోలీసులు అత్యంత పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఇప్పటికే సీఆర్పీసీ సెక్షన్ 144, పోలీస్ చట్టం సెక్షన్ 30 అమల్లోకి తెచ్చారు. ఎస్పీ జగదీశ్ నిరంతరాయంగా సిబ్బందికి సూచనలిస్తూ శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపడుతున్నారు. అనుమానితులను ప్రశ్నించడంతో పాటు సరైన పత్రాలు లేని వాహనాలు, అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు. బహిరంగ సభలు, సమావేశాలకు అనుమతులు ఇవ్వడం లేదు. ఆటోలకు మైక్‌లు ఏర్పాటు చేసి పోలీసు హెచ్చరికలను అనౌన్స్ చేస్తున్నారు.బంకుల్లో పెట్రోలు, డీజిల్ లూజు అమ్మకాలు చేయవద్దని, బాటిళ్లలో ఎట్టి పరిస్థితుల్లో నింపవద్దని ఆదేశాలిచ్చారు. పాత నేరస్తులపై నిఘా పెట్టడంతో పాటు రాత్రి వేళల్లో, అనుమానిత ప్రాంతాల్లో గస్తీ పెంచి నిఘా పటిష్టం చేశారు.సోమవారం కడియం స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిపై అక్రమ మద్యం కేసు నమోదు చేశారు.బాణసంచా కేంద్రాలకు సూచనలు చేశారు. ఉత్సవాల పేరుతో బాణసంచా కాల్చడాన్నీ నిషేధించారు.

రైల్వే స్టేషన్‌లో మరమ్మతు పనులు

- రూ.1.80 కోట్లతో పనులు ఆరంభం
- డీఈఎన్ స్వీయ పర్యవేక్షణ



రాజమండ్రి రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫాంపై పనులు

రాజమహేంద్రవరం, మే 21(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి ప్రధాన రైల్వే స్టేషనులో ట్రాక్ మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయి. విజయవాడకు చెందిన సూర్యదేవర కనస్ట్రక్షన్స్ కంపెనీ ఈ పనులను రూ.1.80 కోట్లతో చేపట్టింది. ఈ నెల 6న గూడ్స్ రైలు రెండో ప్లాట్‌ఫాం వద్ద పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజున విజయవాడ నుంచి డీఆర్ఎం నరేంద్ర ఎ.పాటిల్ నేతృత్వంలో ఉన్నతస్థాయి అధికారుల బృందం వచ్చి ట్రాక్‌లను క్షుణ్ణంగా పరిశీలించింది. ఒకటి, రెండు ప్లాట్‌ఫాం పట్టాల కింద స్లీపర్ల(సిమెంటు కమ్మీలు)ను మార్చాలని నిర్ణయించారు. మొదటిగా రెండో ప్లాట్‌ఫాం వద్ద ప్రొక్లెయినర్లతో స్లీపర్లను తొలగిస్తున్నారు. సమాంతరంగా ఒకటో ప్లాట్‌ఫాం పనులను ప్రారంభించారు. రెండు ప్లాట్‌ఫాం ట్రాకుల స్లీపర్లను తొలగించి కొత్తవి వేస్తున్నారు. స్లీపర్ల కింద కూడా బేస్‌ను పటిష్టం చేస్తున్నారు. పనుల కారణంగా రెండో ప్లాట్‌ఫాంపై ట్రాఫిక్‌ని నిలిపివేశారు.ఈ ట్రాక్‌పై ట్రాఫిక్‌ని అనుమతించిన తర్వాత మొదటి ప్లాట్‌ఫాంపై రైళ్ల రాకపోకలను నిలిపి వేయనున్నారు. రెండు ట్రాక్‌ల మధ్య డ్రైనేజీ వ్యవస్థను కూడా మెరుగు పరుస్తు న్నారు. మొత్తం పనులు పూర్తి కావడానికి నెల రోజులు పట్టే అవకాశం ఉంది. మరమ్మతు పనులను డీఈఎన్ రవికుమార్ సమ్మి విజయవాడ నుంచి వచ్చి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే 4, 5 ప్లాట్‌ఫాంలు అందుబాటులోకి రావడంతో రైళ్ల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. సాధారణంగా పదేళ్లకోసారి ఈ పనులు చేయాల్సి ఉంది. కానీ అలా జరగకపోవడంతో పట్టాల కింద బేస్ సామర్థ్యం తగ్గి రైలు పట్టాలు తప్పే వరకూ పరిస్థితి వచ్చింది. ఒకటి, రెండు ట్రాక్ లకు సంబంధించి కొంత భాగం 2008లో, మరికొంత 2013లో పనులు పూర్తి చేశారు. ట్రాక్‌ల వద్ద డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా పాడైపోయింది. ప్రతి రోజూ మొత్తం 160 రైళ్లు రాకపో కలు సాగిస్తాయి.22 టన్నుల యాక్సిల్ లోడ్‌తో ప్రయాణిస్తుంటాయి.



కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే
కృష్ణబాబు ఇక లేరు

- అనారోగ్యంతో హైదరాబాద్‌లో మృతి
- దొమ్మేరు జమిందార్‌గా సుపరిచితం
- ఎన్టీఆర్ పిలుపుతో రాజకీయాల్లోకి..
- ఐదుసార్లు ఎమ్మెల్యేగా విజయం
- నాడు ఉమ్మడి పశ్చిమను శాసించిన నాయకుడు
- భార్య మరణంతో ఇంటికే పరిమితం

కొవ్వూరు, మే 21 : ఉమ్మడి పశ్చిమగోదావరిజిల్లా రాజకీయాల్లో నాలుగు దశాబ్దాలపాటు కింగ్‌మేకర్‌గా వ్యవహరించిన కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే, ప్రముఖ పారిశ్రామికవేత్త, దొమ్మేరు జమిందారు పెండ్యాల వెంకట కృష్ణారావు(కృష్ణబాబు)ఇక లేరు. ఆయన వయసు 71 ఏళ్లు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన హైదరాబాద్‌లోని ఓ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మంగళవారం ఉదయం 11 గంటలకు తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. భార్య నాగమణి కొన్నేళ్ల క్రితమే మరణించారు. అప్పటినుంచి ఇంటికే పరిమితమయ్యారు.

కృష్ణబాబు ప్రస్థానం

తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు ఎన్టీఆర్ పిలుపుతో కృష్ణబాబు 1982లో రాజకీయాల్లోకి ప్రవేశించారు. 1983, 1985, 1989, 1994, 2004 సంవత్సరాల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఐదుసార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. 1999లో మాత్రం ఓటమి పాలయ్యారు. సుమారు 23 ఏళ్లపాటు ఎమ్మెల్యేగా సుదీర్ఘ రాజకీయ ప్రస్థానం కొనసాగించారు. అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి ప్రజా నాయకుడిగా పేరు పొందారు. నిజాయితీతో, నిస్వార్థంగా ప్రజాసేవ చేయడం వల్ల ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో తిరుగులేని నేతగా ఎదిగారు. కొవ్వూరుతోపాటు, పోలవరం, గోపాలపురం, చింతలపూడి, తణుకు నియోజకవర్గ అభ్యర్థుల గెలుపులో కీలకపాత్ర పోషించేవారు. ఉమ్మడి పశ్చిమలో అన్ని నియోజకవర్గాల్లోను అభిమానులను, అనుచరగణాన్ని కలిగి ఉన్నారు. నాలుగు దశాబ్దాలపాటు జిల్లా రాజకీయాలను శాసించారు. మెట్ట ప్రాంతంలోని నాయకులు, కార్యకర్తలు ఆయన మాట జవదాటేవారు కాదు. జిల్లా పరిషత్, జిల్లా సహకార కేంద్రబ్యాంక్ ఛైర్మన్ల ఎంపికలోనూ కీలకపాత్ర పోషించేవారు. 2009లో నియోజకవర్గాల పునర్విభజనతో కొవ్వూరు ఎస్సీ రిజర్వు కావడంతో ఆయన పోటీకి దూరమయ్యారు. 2012 వరకు క్రియాశీలక రాజకీయాల్లో ఉన్నారు. ప్రస్తుతం వైసీపీ కేంద్రపాలక మండలి సభ్యులుగా కొనసాగుతున్నారు. ది ఆంధ్రా సుగర్స్ వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్యాల శ్రీరామచంద్ర వెంకటకృష్ణరంగారావు, అచ్చాయమ్మ దంపతులకు కృష్ణబాబు మూడో సంతానంగా 1953 మే 31న జన్మించారు. ముళ్ళపూడి హరిశ్చంద్రప్రసాద్‌కు సోదరి కుమారుడు. బోళ్ల బుల్లిరామయ్యకు బావమరిది. ది ఆంధ్రా సుగర్స్ లిమిటెడ్ ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల నరేంద్రనాథ్ చౌదరి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ పెండ్యాల అచ్యుతరామయ్య(అచ్చిబాబు)లకు సోదరుడు. కృష్ణబాబుకు ఇద్దరు కుమారులు వెంకట్రాయుడు, రవిబాబు (ఎం.డి విభాస్ పాలిమర్స్), కుమార్తె అర్చన ఉన్నారు. కుమారులు పారిశ్రా మికవేత్తలు కాగా, కుమార్తె గృహిణి, అల్లుడు ఎస్.రాజీవ్‌కృష్ణ ప్రస్తు త రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడిగా ఉన్నారు.

నేడు అంత్యక్రియలు

కృష్ణబాబు భౌతికకాయాన్ని హైదరాబాద్ నుంచి కొవ్వూరు మండలం దొమ్మేరులోని వారి నివాసానికి తీసుకువస్తున్నారు. బుధవారం మధ్యాహ్నం దొమ్మేరులో అంత్యక్రియలు నిర్వహించనున్నారు.



మాజీ ముఖ్యమంత్రి ఎన్టీఆర్‌తో కృష్ణబాబు



మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబుతో కృష్ణబాబు



2023లో పుట్టినరోజు వేడుకలలో కేక్ కట్ చేస్తున్న కృష్ణబాబు



టీడీపీ నాయకులతో కృష్ణబాబు, దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌తో బాబు

కృష్ణబాబు మరణం తీరనిలోటు

కృష్ణబాబు మరణం జిల్లావాసులకు తీరని లోటని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ ద్విసభ్య కమిటీ సభ్యుడు కంఠమణి రామకృష్ణారావు, జొన్నలగడ్డ సుబ్బరాయచౌదరి అన్నారు. 'ప్రజలకు ఏ ఆపద వచ్చినా ఆయన వెంటనే స్పందించేవారు. ఆయన హయాంలోనే నియోజకవర్గంలో పంపింగ్ స్కీమ్ ఏర్పాటు చేసి, రైతులకు సాగునీరందించారు. 2003 గోదావరి పుష్కరాలకు కొవ్వూరు పట్టణాన్ని అభివృద్ధి చేశారు. అచ్చాయమ్మ కాలనీలో పేదలకు ఇళ్లస్థలాలు అందించారు' అని కొనియాడారు. కృష్ణబాబు మృతికి సంతాపంగా బుధవారం నియోజకవర్గంలో వ్యాపారులు, పారిశ్రామికవేత్తలంతా సంతాప దినంగా పాటించాలని కోరారు. సంతాపం తెలిపిన వారిలో కొవ్వూరు మునిసిపల్ ఛైర్‌పర్సన్ బావన రత్నకుమారి, రాజేష్, ఏఎంసీ మాజీ ఛైర్మన్ బండి పట్టాభి రామారావు, ఇమ్మణ్ణి వీర శంకరం, పేరిచర్ల బోసురాజు, కేవీకే రంగారావు, పెనుమాక జయరాజు, పిక్కి నాగేంద్ర సంతాపం తెలిపారు.

కృష్ణబాబు మృతికి హోం మంత్రి సంతాపం

దేవరపల్లి, మే 21: కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల కృష్ణబాబు మృతి పట్ల హోం మంత్రి తానేటి వనిత తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. యర్నగూడెం క్యాంపు కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ కృష్ణబాబు ఆత్మకు శాంతి చేకూరాలని సంతాపం తెలిపి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కృష్ణబాబు మరణం వ్యక్తిగతంగా తనకు, తమ పార్టీ తీరని లోటన్నారు. తన తండ్రి మాజీ ఎమ్మెల్యే జొన్నకూటి బాబాజీరావుతో కృష్ణబాబుకు ఉన్న సాన్నిత్యాన్ని గుర్తు చేసుకున్నారు. తన రాజకీయ ఎదుగుదలకు ఎంతో కృషి చేశారన్నారు. అలాగే చిన్నాయిగూడెం గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు కాట్రగడ్డ శ్రీనివాస్‌చౌదరి.. కృష్ణబాబు మృతికి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. నియోజకవర్గ అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. ఆయన మృతి మెట్ట ప్రాంత ప్రజలకు తీరని లోటని అన్నారు.

కృష్ణబాబు మృతికి చంద్రబాబు సంతాపం

కొవ్వూరు, మే 21: కొవ్వూరు మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) మృతి పట్ల టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు సంతాపం తెలిపారు. ఎమ్మెల్యేగా కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి కృష్ణబాబు విశేష సేవలు అందించారన్నారు. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ మేరకు చంద్రబాబు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారని కొవ్వూరు నియోజకవర్గ టీడీపీ కార్యాలయ వర్గాలు తెలిపాయి.

ఏపీ ఈఏపీసెట్‌కు రెండు సెషన్లలో 1478 మంది హాజరు

జేఎన్టీయూకే, మే 21: కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి మంగళవారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 597 మంది విద్యార్థి హాజరు కావాల్సి ఉండగా 581 మంది హాజరయ్యారని, 16 మంది గైర్హాజరు కాగా, 97.32 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 920 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా 897 మంది హాజరయ్యారని, 23 మంది గైర్హాజరు కాగా 97.50 శాతం హాజరు నమోదైందన్నారు. మొత్తం రెండు సెషన్‌లలో 1,517 మంది హాజరుకావాల్సి ఉండగా 1,478 మంది హాజరయ్యారని 39 మంది పరీక్ష రాయలేదని 97.43 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాలకోసం రాజమహేంద్రవరం ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఆన్‌లైన్‌లో రెండు సెషన్‌లలో నిర్వహించిన పరీక్షకు 1,422 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1395 మంది హాజరుకాగా మొత్తం 98.10 శాతం హాజరు నమోదైందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలోని భట్లపాలెంలో గల బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో రెండు సెషన్లలో మంగళవారం నిర్వహించిన ఇంజనీరింగ్ విభాగ పరీక్షకు 690మంది హాజరు కావాల్సి ఉండగా 672 మంది హాజరుకాగా మొత్తం 97.39 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. ఈనెల 23 వరకూ ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ప్రవేశపరీక్షలు కొనసాగుతాయన్నారు.

పీఏపీఎస్‌లకు కామన్ సర్వీస్ సెంటర్స్ పోర్టల్‌పై శిక్షణ

- రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ ఎస్ఎల్ఎన్టీ శ్రీనివాస్

కాకినాడరూరల్, మే 21: భారత ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సహకారం ద్వారా ఆర్థిక సమృద్ధిలో భాగంగా కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో కామన్ సర్వీస్ సెంటర్స్ పోర్టల్‌లో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలకు అర్హత కల్పించుట ద్వారా ఆర్థిక వనరులను పెంచేందుకు కేంద్ర ప్రభుత్వం విప్లవాత్మక నిర్ణయం తీసుకొందని రాష్ట్ర సమన్వయకర్త డాక్టర్ ఎస్ఎల్ఎన్టీ శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. దానిలో భాగంగా రానున్న 3 నెలల్లో శిక్షణలు చేపట్టేందుకు కేంద్ర ప్రభుత్వం సూచించిన మార్గదర్శకాలు ప్రకారం ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామన్నారు. కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఏపీలో 1858, తెలంగాణలో 390 సంఘాల పరిధిలో ఈ శిక్షణ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో గల 288 మంది పీఏసీఎస్‌లలో ఈ శిక్షణ చేపడతామని దీని కోసం ఆయా రాష్ట్ర ప్రభుత్వాల సహకారం తీసుకోవడం జరుగుతుందని శిక్షణ అందించేందుకు కేంద్ర ప్రభుత్వంచే గుర్తించిన సాంకేతిక నిపుణులు పాల్గొంటారని తెలిపారు. దీనికి సంబంధించిన పూర్తిగా ఆర్థిక సహకారాన్ని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కల్పిస్తున్నదని, న్యూఢిల్లీలోని నేషనల్ కౌన్సిల్ ఫర్ కోఆపరేటివ్ ట్రైనింగ్ సంస్థ పర్యవేక్షణలో జరుగుతుందన్నారు.

అడ్డతీగలలో పెట్రోల్ రూ.200

అడ్డతీగల, మే 21: అడ్డతీగల గిరిజన సహకార సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పెట్రోల్ బంక్‌లో గత మూడు రోజుల నుంచి పెట్రోల్ నిల్వలు లేక మండలం లోతట్టు గ్రామాల సైతం ఒక లీటర్ పెట్రోల్ రూ.180 నుంచి రెండు వందల రూపాయల వరకు అమ్మడంతో వాహనదారులు అల్లాడిపోతున్నారు. ఎన్నికల నిబంధనల మేరకు పెట్రోల్ బంక్‌లలో తప్ప ప్రైవేటుగా పెట్రోల్ అమ్మకాలను నిషేధించారు. అడ్డతీగల బంక్‌లో పెట్రోల్ లేకపోవడంతో పెట్రోల్‌ను మైదాన ప్రాంతం నుంచి రవాణా చేస్తున్నారు.

వేదఘోషతో పులకించిన సత్యదేవుడి సన్నిధి

- ఘనంగా పండిత సదస్యం
- సుమారు 100 మంది పండితులకు సత్కారం



పండిత సదస్యం కార్యక్రమానికి హాజరైన పండితులు



పండితులను సత్కరిస్తున్న ఈవో రామచంద్రమోహన్

అన్నవరం, మే 21: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి మంగళవారం వేదఘోషతో పులకించింది. రాష్ట్రం నలుమూలల నుంచి వేదాలలో నిష్ణాతులైన పండితులు తమ వేదవిద్యను స్వామివారి పాదాలచెంత ఉంచి పునీతులయ్యారు. స్వామివారి దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా మంగళవారం సాయంత్రం పండిత సదస్యం అత్యంత ఘనంగా జరిగింది. మధ్యాహ్నం 3గంటలకు నవవధూవరులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అనివేటి మండపం వద్దకు తోడ్కొని వచ్చారు. సర్వాంగసుందరంగా అలంకరించిన వేదికపై ఆసీనులు గావించి మరో వేదికపై క్షేత్రపాలకులు సీతారాములను ఉంచి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా పండితులంతా తమ పాండిత్యంతో మైమరిపింపచేశారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన సుమారు 100మంది పండితులను పూలమాలలు, దుశ్శాలువా కప్పి, విసినకర్రను అందజేసి నగదు పురస్కారాలను ఈవో రామచంద్రమోహన్, ఛైర్మన్ రోహిత్‌లు అందజేశారు. కార్యక్రమం అనంతరం పండితులంతా నవ దంపతుకు వేదాశీర్వచనాలు అందజేశారు.

పొన్నవాహనంపై విహరించిన స్వామి,అమ్మవార్లు



పొన్నవాహనంపై విహరిస్తున్న స్వామి,అమ్మవార్లు

సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలలో భాగంగా మంగళవారం రాత్రి నవదంపతులు పొన్నవాహనంపై విహరించారు. ఛైర్మన్ రోహిత్ టెంకాయికొట్టి కార్యక్రమం ప్రారంభించారు. వివిధ సాంస్కృతిక కార్యక్రమాల నడుమ గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

సత్యదేవుడి చక్రస్నానం కోసం ఏర్పాట్లు

రత్నగిరివాసుడైన సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాలలో ముఖ్య ఘట్టాలలో ఒక్కటైన చక్రస్నానం నిర్వహణకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది పంపా రిజర్వాయర్‌లో నీటిమట్టం లేకపోవడం, పుష్కరజలాల కోసం ప్రయత్నించిన అది సాధ్యపడకపోవడంతో ఉన్న కొద్దిపాటి నీటిని ఎక్స్‌కవేటర్‌తో చిన్నకొలను ఏర్పాటుచేసి నీటిని కొలనులోకి ప్రత్యేకమార్గం ద్వారా నీటితో నింపుతున్నారు.

నిరాధార వదంతులు వ్యాప్తి చేస్తే కఠిన చర్యలు : ఎస్పీ



కాకినాడ క్రైం, మే 21 : ఎన్నికల లెక్కింపు రోజు, తర్వాత కాకినాడసిటీ, పిఠాపురం నియోజకవర్గాల్లో హింసాత్మక ఘటనలు జరిగే అవకాశం ఉందంటూ సామాజిక మాధ్యమాల్లో వస్తున్న సందేశాల్లో ఏమాత్రం నిజంలేదని, తప్పుడు వదంతులు వ్యాప్తిచేస్తే కఠినచర్యలు తప్పవని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్‌కుమార్ హెచ్చరించారు. గత రెండురోజులుగా వివిధ సామాజిక మాధ్యమాలు, ప్రింట్, ఎలక్ట్రానిక్ మీడియా విభాగాల్లో కౌంటింగ్ రోజున, కౌంటింగ్ తర్వాత కాకినాడ సిటీ, పిఠాపురం నియోజకవర్గం పరిధిలో పలు హింసాత్మక ఘటనలు చోటుచేసుకునే అవకాశం ఉందంటూ నిఘా విభాగం నుంచి ఎన్నికల కమిషన్‌కు నివేదికలు వెళ్లాయని వస్తున్న వార్తల్లో ఎటువంటి నిజం లేదన్నారు. కాకినాడ జిల్లాలో గత నాలుగు నెలలుగా కేంద్ర పారా మిలటరీ బలగాల సమన్వయంతో పోలీసులు పూర్తిస్థాయిలో గస్తీ నిర్వహించారని, అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ప్రజలు, రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో సాధారణ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించినట్లు తెలిపారు. అక్కడక్కడ చెదురుమదురు సంఘటనలు మినహా ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు పోలీసులు కృషి చేశారన్నారు. నేర ప్రవృత్తి గలవారిని, సమస్యలు సృష్టించే వారిని మండల రెవెన్యూ అధికారి, మేజిస్ట్రేట్ ఎదుట బైండోవర్ చేశామన్నారు. ఎన్నికల సంఘం, ఏపీ డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా ఉన్నతాధికారుల సూచనల మేరకు పోలీసు అధికారులు, సిబ్బంది సమన్వయంతో శాంతి భద్రతలను పరిరక్షించే దిశగా చర్యలు తీసుకున్నామని చెప్పారు.

నిబంధనలు అనుసరించి బ్రిడ్జిని పూర్తిచేయాలి

బ్రిడ్జి పనులను పరిశీలించిన ఏఐఐబీ బృందం



గంటిపెదపూడిలో వంతెన పనులను పరిశీలిస్తున్న ఏఐఐబీ బృందం

పి.గన్నవరం, మే 21: నిబంధనలు అనుసరించి నిర్దేశిత సమయంలో బ్రిడ్జిని పూర్తిచేసే విధంగా ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని ఏసియన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఇన్‌వెస్ట్‌మెంట్ బ్యాంక్ (ఏఐఐబీ) బృందం సూచించింది. గంటిపెద పూడిలో లంక గ్రామాల ప్రజలు రాకపోకల కోసం నదీపాయపై నిర్మిస్తున్న హైలెవెల్ బ్రిడ్జి పనులను ఏఐఐబీ బృందం పరిశీలించి అనంతరం సంబం ధిత కాంట్రాక్టర్ పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఏఐఐబీ పరిధిలో జరుగుతున్న ప్రాజెక్టుల్లో ఈప్రాజెక్టు పనులు నిబంధనలు ప్రకారం జరుగుతున్నాయని కితాబుచ్చారు. అంతేకాకుండా నిబంధనల్లో భాగంగా ఎక్స్‌కవేటర్‌ను మహిళ ఆపరేటింగ్ చెయ్యడంపై హర్ష వ్యక్తంచేసి సంబంధిత ఫొటోను వెబ్‌సైట్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. అనంతరం ఇప్పటివరకు జరిగిన పనుల్లో భాగంగా మూడు బాక్స్ కల్వర్టులు, ఒక అబట్ మీట్, నాలుగు పిల్లర్లు, 250 మీటర్ల అప్రోచ్‌రోడ్డు పనులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నికల కోడ్ అనంత రం ఇప్పటివరకు జరిగిన కాల్వపై వంతెన, హైలెవిల్ బ్రిడ్జి పనులకు బిల్లులు మంజూరు చేసే విధంగా సిఫార్సు చేస్తామని చెప్పారు. వంతెన నిర్మాణం నిమిత్తం భూములు ఇచ్చిన రైతులకు త్వరితగతిన నష్టపరిహారం అందేవిధంగా చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. పరిశీలనలో సీఈ సీవీ సుబ్బారెడ్డి, ఈఈ రమణమూర్తి (విజయవాడ), ఎస్ఈ వి.రవీంద్ర, ఈఈ కె.చంటిబాబు, ప్రాజెక్టు డీఈ అన్యం రాంబాబు, ఏఐఐబీ బృందం సభ్యులు పరాద్ అహ్మద్, కౌశిక్ రహమాన్(బంగ్లాదేశ్), అశోక్‌కుమార్(ఇండియా), యోగేష్ మల్లా(నేపాల్), లారా(ఫిలిఫిన్), ప్రాజెక్ట్ అడ్వయిజర్ ప్రభాకరరె డ్డి, నరసింహారావు, ఏఈఈ సత్యనారాయణ, కొండలరావు పాల్గొన్నారు.

మునిపల్లిలో వివాహిత మృతి

- ఆత్మహత్యగా కేసు నమోదు
- అల్లుడే హత్య చేశాడని తల్లి ఆరోపణ



నాగారపు లలిత(ఫైల్)

ఉప్పలగుప్తం, మే 21: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉప్పలగుప్తం మండలం మునిపల్లిలో సోమవారం రా త్రి ఒక వివాహిత మృతి అనుమానాస్పదంగా మారింది. తన కుమార్తెను అల్లుడే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరిస్తున్నాడని తల్లి ఆరోపిస్తోంది. మునిపల్లికి చెందిన వివాహిత నాగారపు లలిత (29) భర్త వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్య చేసుకున్నట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. మండలంలోని వాడపర్రు ఇందిరా నగర్‌కు చెందిన లలితతో మునిపల్లికి చెందిన భీమేంద్రకు ఐదేళ్ల క్రితం వివాహమైంది. వీరికి మూడేళ్ల కుమారుడు ఉన్నాడు. భార్యాభర్తలు తరచూ గొడవపడుతుండేవారని... ఈ నేపథ్యంలో భర్త వేధింపులతో లలిత ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడినట్టు పోలీసులు తెలిపారు. సంఘటనా స్థలాన్ని డీఎస్పీ మహేశ్వరరావు సందర్శించి వివరాలు సేకరించారు. తన కుమార్తెను అల్లుడే హత్యచేశాడని మృతురాలి తల్లి పరమట పుష్పావతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. తన అల్లుడికి వివాహేతర సంబంధాలున్నాయని, ఆ కారణంగానే దంపతులిద్దరూ తరచూ గొడవలు పడుతుండేవారని ఫిర్యాదులో పేర్కొంది.

ఉప్పుటేరులో దూకి వివాహిత ఆత్మహత్య



బోరా దుర్గ

కొత్తపల్లి, మే 21: వివాహేతర సంబంధం కారణంగా ఏర్పడిన మనస్పర్థల కారణంగా వివాహిత ఉప్పుటేరు కాలువలో దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం అమరవల్లిలో మంగళవారం జరిగింది. కొత్తపల్లి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... అమరవల్లి గ్రామానికి చెందిన బోరా దుర్గ(38) అనే వివాహిత అదే గ్రామానికి చెందిన మరో వ్యక్తితో వివాహేత సంబంధం కొనసాగిస్తోంది. వివాహేతర సంబంధం కొనసా గిస్తున్న వ్యక్తి అవసరమైనప్పుడు దుర్గ నుంచి చాలా కాలంగా నగదును తీసుకొంటూ వస్తున్నాడు. డబ్బుల విషయంలో ఏర్పడిన మనస్పర్థల కా రణంగా ఇటీవల ఇద్దరు గొడవలు పడ్డారు. ఈనేపథ్యంలో ఆ వ్యక్తి పెట్టే బాధలు భరించలేక ఉప్పుటేరులో దూకి ఆత్మహత్య చేసుకొందని పోలీసులు తెలిపారు. మృతురాలి భర్త రాంబాబు ఫిర్యాదుమేరకు కొత్తపల్లి పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

- బస్సు ప్రమాద ఘటనలో ఐదుకు చేరిన మృతుల సంఖ్య



చిలకలపూడి సురేష్(ఫైల్)

పి.గన్నవరం, మే 21:ఈనెల 14న అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ఉడిమూడి శివారు చింతా వారిపేటలో జరిగిన ఈప్రమాద ఘటనలో నలుగురు కూలీలు (చిలకపూడి మణిబాబు, నూకపెయ్యి శివ, వాసంశెట్టి సూర్యప్రకాష్, ఈరి కట్ట య్య) అక్కడికక్కడే మృత్యువాత పడగా మరో యువకుడు చిలకలపూడి సురేష్(35)ను చికిత్స నిమిత్తం గన్నవరం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి మెరుగైన చికిత్స నిమిత్తం అమలాపురం కిమ్స్ ఆసుపత్రికి తరలించి ఈనెల 17న వైద్యులు సూచన మేరకు కాకినాడ ఒక ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం అర్ధరాత్రి దాటిన తరువాత సురేష్ కన్నుమూశాడు. స్థానిక ఎస్ఐ బి.శివకృష్ణ పంచనామా కార్యక్రమాలు పూర్తి చేసి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని బంధువులకు అప్పగించారు.

ఆ....తల్లికి గర్భశోకం మిగిల్చిన ఇద్దరు కుమారులు

ఈప్రమాద ఘటనలో ఒకే కుటుంబానికి చెందిన ఇద్దరు సోదరులు మృతి చెందడంతో ఆ తల్లిదండ్రులు పడుతున్న రోదన వర్ణనాతీతం. చేతికి అందివచ్చిన కొడుకులు ఇద్దరు ఒకేసారి కళ్ల ముందు లేకపోవడంతో దేవుడు గర్భశోకాన్ని మిగిల్చారని రోధిస్తుంది. ఉడిమూడి శివారు ఆదిమూలంవారిపాలెంనకు చెందిన చిలకలపూడి వెంకటేశ్వరావు, సత్యనారాయణమ్మ దంపతులకు ముగ్గురు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఈ ప్రమాద ఘటనలో చివరి ఇద్దరు కుమారులు సురేష్, మణిబాబు మృతి చెందడంతో ఆ కుటుంబంతో పాటు గ్రామాన్ని సైతం శోకసముద్రంలో ముంచెత్తింది.

పిఠాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి అవమానం

- బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ రాస్తారోకో



బాధ్యులపై చర్యలు తీసుకోవాలని రాస్తారోకో చేస్తున్న దళిత సంఘాల నాయకులు



పిఠాపురం అగ్రహారంలో అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దృశ్యం

పిఠాపురం, మే 21: పిఠాపురంలో అంబేడ్కర్ విగ్రహానికి అవమానం జరిగింది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలంటూ దళిత సంఘాల నేతలు రాస్తారోకోకి దిగారు. పిఠాపురం పట్టణంలోని అగ్రహారం పశువుల సంత సమీపంలో ఉన్న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని గుర్తు తెలియని వ్యక్తులు పాక్షికంగా ధ్వంసం చేశారు. ముఖంపై గుర్తు తెలియని వ్యక్తులు గాట్లు పెట్టారు. విషయం తెలుసుకున్న దళిత సంఘాల నేతలు, ప్రజాప్రతినిధులు మంగళవారం సాయంత్రం అక్కడకు చేరుకుని అంబేద్కర్ విగ్రహాన్ని పరిశీలించారు. అంబేద్కర్ విగ్రహాన్ని ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ పిఠాపురం ఆర్అండ్‌బీ ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. వీరి ఆందోళనతో ట్రాఫిక్ భారీగా జామ్ అయింది. న్యాయం జరిగే వరకూ ఆందోళన విరమించేదిలేదని స్పష్టం చేశారు. విషయం తెలుసుకున్న పిఠాపురం ఇన్‌చార్జి సీఐగా ఉన్న సర్పవరం సీఐ వైఆర్‌కే శ్రీనివాస్, పిఠాపురం ఎస్ఐ మురళీమోహన్, అదనపు ఎస్ఐ వెంకటేష్‌లు అక్కడకు చేరుకున్నారు. ధ్వంసమైన విగ్రహాన్ని పరిశీలించారు. ఆందోళనకారులతో మాట్లాడారు. దర్యాప్తు చేపట్టి బాధ్యులను గుర్తించి అరెస్టు చేస్తామని సీఐ వైఆర్‌కే హామీ ఇచ్చారు. దీంతో వారు ఆందోళన విరమించారు. అనంతరం దళిత సంఘాల నాయకులతో కలిసి సీఐ అంబేద్కర్ విగ్రహానికి రంగు వేసి పాలాభిషేకం నిర్వహించారు. స్థానికుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దేవరపల్లిలో 226 రాగి దిమ్మలు స్వాధీనం

- నలుగురి అరెస్టు

దేవరపల్లి, మే 21: దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద వాహన తనిఖీల్లో భాగంగా మంగళవారం 226 రాగి దిమ్మలను స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం దేవరపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద కేసు వివరాలను వెల్లడించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం పెదపూడి గ్రామానికి చెందిన సుంకర సతీష్, కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి దుర్గ, నక్కా నాగేంద్రకుమార్, నెల్లూరి లోవరాజు కాకినాడ, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రాత్రిళ్లు దొంగతనాలు చేస్తుంటారు. సుంకర సతీష్ పెదపూడిలో పాత ఇనుము వ్యాపారం చేస్తుంటాడు. నాగేంద్ర, దుర్గ, లోవరాజు ఇంటింటికీ వెళ్లి ఇనుప సామాన్లు కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే వీరు ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైరును దొంగిలించేవారు. ఆ రాగివైరును సతీష్‌కు అమ్ముతుంటారు. సతీష్ వ్యాపారాన్ని విస్తరించి కొద్దికాలం కిందట తాడేపల్లిగూడెంలోని డంపింగ్‌యార్డు వద్ద షాపు తెరిచాడు. దొంగిలించిన రాగివైరును అందులోనే కరిగించి దిమ్మలుగా చేసి అమ్మడానికి తరలిస్తుంటారు. 120 వ్యవసాయ క్షేత్రాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లు పగలగొట్టి కాపర్‌వైరు దొంగిలించారు. 226 రాగి దిమ్మలను ఆరుమూటల్లో పెట్టుకుని వ్యాన్లలో అమ్మకానికి విజయవాడ బయలుదేరారు. దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద ఎస్ఐ కె.శ్రీహరిరావు సిబ్బందితో వాహన తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డారు. నలుగురిని అరెస్టుచేసి, సుమారు రూ.6లక్షల విలువైన చోరీ సొత్తుతోపాటు మినీవ్యాన్, రెండు మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ రామారావు తెలిపారు. కార్యక్రమంలో సీఐ బాలసురేష్‌బాబు, రాజమండ్రి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కే.రజనీకుమార్, ఎస్ఐ శ్రీహరిరావు పాల్గొన్నారు.



చోరీ సొత్తుతో వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు డీఎస్పీ రామారావు

23న రాజశ్యామల యాగం

రాజానగరం(కోరుకొండ), మే 21: ఈ నెల 23న కోరుకొండ మండలం గాదరాడలోని ఓం శక్తిపీఠంలో మహాసుదర్శన సహిత మహాచండీ సహిత రాజశ్యామల యోగం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమిళనాడుకు చెందిన 30 మంది పండితులతో మహాచండీ, మహామృత్యుంజయ, రాజశ్యామల, మహా సుదర్శన యాగాలు వైభవంగా నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు 82978 69999, 82978 79999 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

ప్రజల సొమ్ము రాళ్లపాలు

- వృథాగా రూ.30 లక్షల వ్యయంతో నిర్మించిన పెట్రోల్ బంక్
- ప్రైవేటు వాహనాలకు అడ్డా మారిన వైనం
- చేపల మార్కెట్‌గా మారిన కొంత స్థలం
- ఇంకొంతలో విగ్రహాల ప్రతిష్ఠకు దిమ్మ ఏర్పాటు
- పట్టించుకోని సీతానగరం పంచాయతీ అధికారులు

సీతానగరం, మే 21: లక్షలాది రూపాయల ప్రజల సొమ్మును పెట్రోల్ బంక్ పేరుతో రాళ్లపాలు చేశారు. సీతానగరంలో వ్యవసాయ సహకార పరపతి సంఘం పెట్రోల్ బంక్ వ్యాపారం చేయాలని నిర్ణయించుకుని, పంచాయతీ నుంచి సదరు స్థలం లీజుకు తీసుకున్నారు. పెట్రోల్ బంక్ నిమిత్తం ఒక భవనం నిర్మించి, పెట్రోల్ పోయడానికి మిషనరీని ఏర్పాటుచేశారు. అయితే ఈ నిర్మాణాలు పర్యావరణానికి ప్రమాదకరంగా ఉన్నాయని, ఇక్కడ


పెట్రోల్ బంక్ కోసం నిర్మించిన భవనం

పెట్రోల్ బంక్‌కు నిర్మాణం చేయకూడదని ప్రజా నివాసాల మధ్యన ఉందని, ఇక్కడ పూర్వం పెద్ద గొయ్యి ఉండేదని, దీని వల్ల ఇక్కడ లూజ్ సాయిల్ ఉంటుందని, పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయకూడదని పర్యావరణ ప్రేమికుడు నకుల సురేష్ నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌ను ఆశ్రయించడంతో పనులు నిలిచిపోయాయి. అప్పటికే సుమారు రూ.30 నుంచి 40 లక్షల వరకు ఖర్చుచేశారు. వివరాల్లోకి వెళితే.. సీతానగరం, లంకూరు, చిన కొండేపూడి గ్రామాల్లోని వాడకం నీరు, వర్షం నీరు పోవడానికి సీతానగం పంచాయతీ పరిధిలో రెండు పెద్ద గోతులున్నాయి. ఒకటి బస్టాండ్ పక్కన ఉన్న కుమ్మరి గొయ్యి కాగా రెండో నాలుగు బొమ్మల సెంటర్‌లో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేస్తున్న చోటు ఉన్న గొయ్యి. మూడు గ్రామాల నీరు ఈ గోతుల్లోకి వెళ్లవలసి ఉంది. అయితే నాలుగు బొమ్మల సెంటర్‌లో గొయ్యిని పూడ్చి గత ప్రభుత్వం స్కేటింగ్ పార్కు ఏర్పాటుచేసింది. చివరి దశకు చేరుకునే సరికి ప్రభుత్వం మారడంతో పనులు నిలిచిపోయి వృథాగా పడివుంది. ఈ స్థలంలో వైసీపీ ప్రభుత్వం వచ్చాక సహకార సంఘం ఛైర్మన్లను నామినేటెడ్ పద్ధతిలో నియమించారు. వీళ్లు, ప్రజా ప్రతినిధులు కలసి పెట్రోల్ బంక్ వ్యాపారానికి తెరదీశారు. దీని కోసం సీతానగరం పంచాయతీ ద్వారా సహకార సంఘం లీజుకు తీసుకుని సబ్ రిజిస్ట్రారు కార్యాలయంలో లీజు రిజిస్ట్రేషన్ చేయించారు. తరువాత సుమారు రూ.30 నుంచి 40 లక్షల వరకు ఖర్చు చేసి పెట్రోల్ బంక్ ఏర్పాటు చేశారు. అయితే నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ ఆదేశాలతో పనులు నిలిచిపోయాయి. దీంతో సహకారం సంఘం లీజు సొమ్ములు పంచాయతీకి చెల్లించకపోవడంతో పంచాయతీ ఆదాయానికి గండి పడింది. లీజు కూడా రద్దు చేసుకున్నట్టు తెలుస్తోంది. ఆ గొయ్యిలోని సగం స్థలాన్ని పెట్రోల్ బంక్ కోసం తీసుకున్నారు. ప్రస్తుతం ఈ స్థలం ప్రైవేటు వాహనాలకు అడ్డాగా మారింది. మిగిలిన స్థలంలో రోడ్డు వైపు విగ్రహాల ఏర్పాటుకు పెద్ద దిమ్మకట్టి అక్కడ ఒక విగ్రహం ఏర్పాటుచేశారు. కాని ఆ విగ్రహాన్ని ఆవిష్కరించలేదు. మిగిలిన స్థలం అనధికారికంగా చేపల మార్కెట్‌గా మారిపోయింది. అయినా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదు.



చేపల మార్కెట్‌గా మారిన స్కేటింగ్ పార్కు స్థలం, ఇదే స్థలంలో ఓ వైపు దిమ్మ కట్టి విగ్రహం పెట్టిన దృశ్యం


ప్రైవేటు వాహనాల పార్కింగ్ ప్లేస్‌గా మారిన పెంట్రోల్ బంక్ స్థలం

ఏజెన్సీ సమాచారం


చంకలో చంటి పిల్లలను ఎత్తుకుని వాగునీరు తెచ్చుకుంటున్న గిరిజన మహిళలు

కన్నీటి కష్టాలు

- మల్లవరం గిరిజనులకు గుక్కెడు నీళ్లు దొరకడం కష్టమే
- గ్రామంలో మౌలిక వసతులు కరువు
- కన్నెత్తి చూడని అధికారులు


మల్లవరం గ్రామంలో సరిగా పని చేయని బోరు

మోతుగూడెం, మే 21: చింతూరు మండలం మోతుగూడెం పరిధిలో మల్లవరం గ్రామస్తులు నెత్తిన బిందే.. చంకలో చిన్నారులు. ఇది వారి కృత్యం. మంచినీళ్లు కావాలంటే కాలినడకన వెళ్లి రావాల్సిందే.. సమాజం అభివృద్ధి చెందుతున్న ఆ గిరిజన ప్రాంతం ఇంకా వెనుకబడి ఉంది. అదే మల్లవరం గ్రామం మోతుగూడెం పరిధిలో ఉన్న ఈ అటవీ ప్రాంతానికి సుమారు 25 సంవత్సరాల క్రితం కొన్ని కుటుంబాలు వచ్చి మల్లవర గ్రామంలో స్థిరపడ్డారు. వారికి అన్ని పథకాలు అందుతున్నా గొంతు తడుపుకున్నందుకు గుక్కెడు నీళ్లు దొరకడం లేదు. ఇక్కడ 15 సంత్సరాల కిందట సీఆర్పీఎఫ్ 121 బెటాలియన్ అధికారులు బోరు వేయించారు. దాని ద్వారా కేవలం మూడు, నాలుగు బిందెల నీళ్లు వస్తాయి. ఆ తర్వాత మురిగునీరు వస్తోంది. ఆ గ్రామం సమీపంలోని వాగు వద్దకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. ఆ వాగులో నీరు కలుషితంగా ఉండటంతో గిరిజనులకు మలేరియా, టైఫాయిడ్ వంటి విష జ్వరాలు బారిన పడుతున్నారు. ఇంత జరుగుతున్నా కనీసం మౌలిక సదుపాయాలు కల్పించడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం చూపుతున్నారు. అంతేగాక మల్లవరం గ్రామానికి సరైన రహదారి లేదు. విద్యుత్ వెలుగులు లేవు. రాత్రులు కటిక చీకట్లో జీవనం. మంచినీటి సమస్యపై మోతుగూడెం పంచాయతీ కార్యదర్శి రవినాయక్‌ను వివరణ కోరగా బోర్లకు మరమ్మతులు చేయిస్తామని విద్యుత్ సమస్యపై అధికారులతో చర్చించి పరిష్కార మార్గాన్ని చూపుతామన్నారు.

గాలివాన బీభత్సం


టేకులబోరులో గాలివాన కారణంగా నేలకొరిగిన చెట్టు

కూనవరం, మే 21: మండలంలో మంగళవారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. ఈకారణంగా పలు గ్రామాల్లో చెట్లు నేలకొరిగాయి. బలమైన ఈదురుగాలులు వీయడంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. కొన్ని గిరిజన గ్రామాల్లో గాలివాన కారణంగా విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడింది.

ఏజెన్సీలో రబ్బరు రైతులకు ప్రోత్సాహకాలు

- ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే


సమావేశంలో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో

రంపచోడవరం, మే 21: ఏజెన్సీలోని మారేడుమిల్లి, వై.రామవరం, రంపచోడవరం మండలాల్లో కొత్తగా రబ్బరు ప్లాంటేషన్ వేసుకునే రైతులను ప్రోత్సహిస్తామని ఐటీడీఏ పీవో సూరజ్ గనోరే పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో మూడు మండలాల ఉపాధి హామీ ఏపీవోలు, సచివాలయ హార్టికల్చర్, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, రబ్బరు బోర్డు ఫీల్డ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ వారం రోజుల వ్యవధిలో రబ్బరు రైతులను గుర్తించి నివేదికలు సమర్పించాలని సూచించారు. రబ్బరు రైతులు కొత్తగా ప్లాంటేషన్ వేసుకొనే వారికి అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌వో చిట్టిబాబు, ఉపాధి పథకం ఏపీడీ జి.శ్రీనివాస్, ఏపీవో జి.రాంబాబు, రబ్బరుబోర్డు ఏడీవో శరత్‌చంద్, ఏడీఏ సీహెచ్‌కేవీ చౌదరి, హార్టికల్చర్ అధికారి ముత్యాల పాల్గొన్నారు.

అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు

- రిటర్నింగ్ అధికారి ప్రశాంత్‌కుమార్


మాట్లాడుతున్న రిటర్నింగ్ అధికారి, ప్రక్కన ఏఎస్పీ జగదీష్ అడహళ్లి

రంపచోడవరం, మే 21: వచ్చేనెల నాలుగో తేదీన జరుగనున్న ఓట్ల లెక్కింపు ప్రక్రియకు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా భద్రతా చర్యలు తీసుకుంటామని రిటర్నింగ్ అధికారి ఎస్.ప్రశాంత్‌కుమార్ తెలిపారు. మంగళవారం స్థానిక ఐటీడీఏ కార్యాలయంలో ఆయన ఏఎస్పీ జగదీష్ అడహళ్లితో కలిసి ఎన్నికల్లో పోటీ చేసిన అభ్యర్థులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్ట్రాంగ్‌రూమ్‌లలో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో నిర్వహించామని, అలాగే ఓట్ల లెక్కింపులో కూడా అభ్యర్థులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలన్నారు. ఏఎస్పీ మాట్లాడుతూ కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు 144 సెక్షన్ అమలులో ఉంటుందని, రూల్స్ అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. పోటీలో ఉన్న అభ్యర్థులు పల్లాల లచ్చిరెడ్డి, బంగారు వెంకటేష్, వివిధ పార్టీల ప్రతినిధులు కొమ్మిశెట్టి బాలకృష్ణ, శివకుమార్, పెంటపాటి అనంతమోహన్, జి.తాతారావు, డీటీలు ఎన్‌వీపీ సత్యనారాయణ, శివ, శ్రీధర్, సీఐ వి.వెంకటేశ్వరరావు, ఎస్ఐ మోహన్‌రావు పాల్గొన్నారు.

అడ్డతీగలలో రాజీవ్‌గాంధీ వర్ధంతి

అడ్డతీగల, మే21: దేశ మాజీ ప్రధానీ రాజీవ్‌గాంధీ వర్ధంతిని స్థానిక కాంగ్రెస్ నాయకుడు దంగేటి సత్తిబాబు ఆధ్వర్యంలో స్థానిక గాంధీ సెంటర్‌లో ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి జ్యోతి ప్రజ్వలన గావించి ఘనంగా నివాళులర్పించారు. దేశానికి దిశా నిర్దేశం చూపిన ఆ నాయకుడి సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రశాంత ఎన్నికల కౌంటింగ్‌కు సహకరించాలి

- డీఎస్పీ అంబికాప్రసాద్.. బొగ్గులదిబ్బ, జేగురుపాడులో కార్డన్ సెర్చ్

కడియం, మే 21: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అంతా సహకరించాలని దక్షిణ మండల డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ అన్నారు. ఎస్పీ పి.జగదీష్ ఉత్తర్వుల మేరకు సౌత్‌జోన్ పరిధిలో రెండు రోజులుగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం టుటౌన్, ధవళేశ్వరం, కడియం ఇన్‌స్పెక్టర్లు వి.శ్రీనివాస్, వి.వినయ్‌మోహన్, బి.తులసీధర్ ఆయా పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, కేంద్ర పారామిలటరీ బలగాలతో టుటౌన్ పరిధిలోని బొగ్గులదిబ్బ, కడియం మండలం జేగురుపాడు శివారు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించామని డీఎస్పీ చెప్పారు. తనిఖీల్లో నెంబర్ ప్లేట్లు లేని 10 మోటారుసైకిళ్లను, జేగురుపాడులో 10 విస్కీ బాటిళ్లను స్వాధీన పరుచుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. విస్కీ బాటిళ్లతో పట్టుబడిన వ్యక్తిపై కడియం పీఎస్‌లో కేసు నమోదు చేశారన్నారు.

అమలులో పోలీస్ యాక్ట్ 30

పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని డీఎస్పీ అంబికాప్రసాద్ తెలిపారు. ముందస్తుగా అనుమతులు లేకుండా ఊరేగింపులు, ప్రదర్శనలు, ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించకూడదన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అనుమతులు లేకుండా బాణసంచా తయారీ, అమ్మడం చేసేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పెట్రోల్ బంక్‌ల్లో పెట్రోలు, డీజిల్‌లను లూజ్ బాటిళ్లు, క్యాన్లలో విక్రయించొద్దన్నారు. పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉందని, శాంతిభద్రతల సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా కఠినచర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.


కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

టీపొడి రీ-ప్యాకింగ్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు


తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రాజమహేంద్ర వరం, మే 21(ఆంధ్ర జ్యోతి): టౌన్ హాలు రోడ్డులోని టీపొడి రీప్యాకింగ్ దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది తనిఖీలు చేశారు. రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్‌ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ తేజ అస్సాం టీ, కీర్తి అస్సాం టీ, అస్సాం టీ కంపెనీల్లో సోదాలు చేశారు. నిషేధ సింథటిక్ ఫుడ్ కలర్ టార్ట్రాజైన్, సన్ సెట్ పసుపులను టీ పొడిలో కలపడంతో నమూనాలను సేకరించి విశ్లేషణ నిమిత్తం ల్యాబ్‌కి పంపించారు. ప్యాకింగ్ లైసెన్సు, కన్స్యూమర్ కేర్ వివరాలు లేకపోవడం, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడడం గుర్తించారు. క్రిమినల్ కేసు నమోదుకు పోలీస్ స్టేషన్‌కి సిఫారసు చేశామని ఎస్పీ చెప్పారు. ఆహార పదార్థాలను కల్తీ చేసినా, నాణ్యతా ప్రమాణాల ప్రకారం వినియోగదారులకు అందించకపోయినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. తనిఖీల్లో డీఎస్పీ ముత్యాలు నాయుడు, నాగ వెంకట రాజు, జగన్నాథరెడ్డి, భార్గవ మహేశ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నిర్దిష్ట ప్రణాళికతో చదవాలి


పుస్తకాలు చదివిస్తున్న గ్రంథాలయాధికారి రామకోటేశ్వరరావు

రంగంపేట, మే 21: విద్యార్థులు నిర్దిష్ట ప్రణాళిక, ఏకాగ్రతతో చదివి లక్ష్యాన్ని సాధించాలని రంగంపేట గ్రంథాలయాధికారి నల్లమిల్లి రామకోటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణా తరగతుల్లో భాగంగా 6వ రోజు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులతో యోగాసనాలు సాధన, ధ్యానం చేయించారు. అనంతరం తెనాలి రామకృష్ణుడు నీతి కథలను, ఐకమత్యం కథలను బోధించారు. కాంపిటేటివ్ విద్యార్థి సీహెచ్ వీరబాబు స్పోకెన్ ఇంగ్లీషుపై శిక్షణ ఇచ్చారు. బాలల గేయాలు ఆలపించారు.

జీవవైవిధ్యాన్ని కాపాడుకుందాం


జీవవైవిధ్యం పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

కడియం, మే 21: నానాటికీ పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని బాధ్యత సేవా సంస్థ అధ్యక్షులు గిరజాల బాబు అన్నారు. జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా జాతీయ పర్యావరణమిత్ర చిలుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన బాబు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యంతో ఎన్నో జీవులు ఉనికిని కోల్పోయాయన్నారు. ఏపీ జీవవైవిధ్య మండలి ప్రచురించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జీవవైవిధ్యం హరించిపోతే భవిష్యత్తులో భూగోళంపై మానవ మనుగడకు హాని ఏర్పడుతుందని శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో గళ్లా చిరంజీవి, పుట్టా శ్రీనివాసరావు, వేదాంతం నాని, పున్నమిరాజు వీర్రాజు, అడపా సుబ్రహ్మణ్యం, మలసాని గోవిందు, చింతాడ హరినాయుడు, వేదులశాస్త్రి పాల్గొన్నారు.

మదన గోపాలస్వామి కల్యాణోత్సవం

నల్లజర్ల, మే 1: అనంతపల్లిలో శ్రీ రుక్మిణి,సత్యభామ సమేత మదన గోపాలస్వామి వార్షిక కల్యాణోత్సవం మంగళవారం రాత్రి మండపం వద్ద వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఛైర్మన్ కానుబోయిన గంగాధరరావు, ఈవో లక్ష్మీశరణ్యలు పూజాదికాలు నిర్వహించి స్వామి,అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 19న ఏకాదశి రోజున ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో భాగంగా 22న రథోత్సవం, 24న పవళింపు సేవ జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు.

బాటిళ్లు, డ్రమ్ముల్లో పెట్రోల్ అమ్మితే కఠిన చర్యలు

డీఎస్పీ రామారావు.. దేవరపల్లిలోని పెట్రోల్ బంకుల పరిశీలన


దేవరపల్లిలో బంక్ వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ రామారావు

దేవరపల్లి, మే 21: బంకుల వద్ద బాటిళ్లు, డ్రమ్ముల్లో పెట్రోల్ అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. మంగళవారం దేవరపల్లిలోని పెట్రోల్ బంకులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం కొన్ని జిల్లాల్లో ఘర్షనలు జరిగాయని, శాంతిభద్రతలకు అంతరాయం ఏర్పడకుండా జూన్ 15వరకు పెట్రోల్ బంకుల్లో, బయట షాపుల వద్ద పెట్రోల్ బాటిల్స్ కలిగి ఉన్న వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ శ్రీహరిరావు సిబ్బంది పాల్గొన్నారు.

విద్యుత్ ఉద్యోగుల ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం


జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాసరావు

గోపాలపురం, మే 21: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల విద్యుత్ ఉద్యోగుల ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుల ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. ఏలూరులో కబర్డిహాలులో ఈ నెల 18న విద్యుత్ ఉద్యోగుల ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా జీపీబీ పాల్, ప్రాంతీయ కార్యదర్శిగా ఎస్.వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోపాలపురం టౌన్ లైన్‌మ్యాన్ చింతలపూడి శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఈదా రాంబాబు, ఉపాధ్యక్షులుగా వి.సునీల్‌కుమార్, కప్పల సురేష్, ఎం.రవిప్రసాద్‌లతో పాటు ఇతర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జిల్లా నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల పర్యవేక్షకుడిగా ఏపీఈపీడీసీఎల్ జనరల్ సెక్రటరీ సీహెచ్.సాయిబాబా వ్యవహరించారన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఉండ్రాజవరం, మే 21: తమ కుమారుడు రాజేష్ కనిపించడంలేదని మండలంలోని చివటం గ్రామానికి చెందిన పామర్తి చిరంజీవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 19న ఉదయం 11గంటలకు తాడేపల్లిగూడెంలో ఉల్లిపాయలు కొనుగోలు చేయడానికి ట్రక్కు ఆటోతో వెళ్లి తిరిగి రాలేదని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.అప్పలరాజు తెలిపారు.

దేశం గర్వించదగ్గ నాయకుడు రాజీవ్‌గాంధీ

కొవ్వూరు, మే 21: దేశం గర్వించదగ్గ నాయకుడు రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి అన్నారు. భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి మంగళవారం పలుచోట్ల నిర్వహించారు. కొవ్వూరులోని పార్టీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు గంధం పూజ్య నరసింహ బాపూజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

ఐటీఐలో నూరు శాతం సీట్ల భర్తీకి ప్రణాళిక

జిల్లా ఉపాధి కల్పన అధికారి హరిశ్చంద్ర ప్రసాద్


సమావేశంలో మాట్లాడుతున్న హరిశ్చంద్రప్రసాద్

రాజమహేంద్రవరం రూరల్, మే 21: జిల్లాలో ప్రభుత్వ ప్రవేట్ పారిశ్రామిక శిక్షణా సంస్థలలో నూరు శాతం సీట్ల భర్తీ చేసేవిధంగా పక్కా ప్రణాళిక తో పాటు సమన్వయ శాఖల సహకారం ఎంతో అవసరమని ఉపాధి కల్పన జిల్లా అధికారి కే హరిశ్చంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం రూరల్ లోని బొమ్మూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ కార్యాలయంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటిఐలో పాస్ అయిన విద్యార్థులకు పరిశ్రమల్లో ఉపాధి కల్పించే విధంగాను, స్వయం ఉపాధి పొందే విధంగాను, జిల్లా స్థాయిలో సమన్వయ కమిటీ పక్కా ముందస్తు కార్యచరణ ప్రణాళిక ఎంతో అవసరమన్నారు. జిల్లా స్థాయి సమన్వయ కమిటి సమావేశాన్ని రాష్ట్ర ఉపాధి కల్పన శిక్షణా శాఖ కార్యదర్శి , సంచాలకులు వారి ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి , జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, ఎల్‌డిఎం , ప్రభుత్వ ఐటిఐ ల కన్వీనర్లు, ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేట్ ఐటిఐల అధ్యక్షులు ,కార్యదర్శులు విద్యార్థులు పాల్గొన్నారు.

మహనీయుడు మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ

వర్ధంతి కార్యక్రమంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి బాలేపల్లి


రాజీవ్ గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బాలేపల్లి

రాజమహేంద్రవరం సిటీ, మే 21: దేశాన్ని ఆర్థిక, ఐటీ రంగాల్లో బలోపేతం చేసిన మహనీయుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ పార్టీ రూరల్ అభ్యర్థి బాలేపల్లి మురళీధరరావు అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి కార్యక్రమాన్ని స్థానిక కృష్ణనగర్‌లోని పార్టీ కార్యాలయంలో నిర్వహించారు. రాజీవ్‌గాంధీ చిత్రపటానికి ఆయన పూలమాలతో నివాళులర్పించారు. దేశానికి రాజీవ్ గాంధీ చేసిన సేవలను గుర్తుచేసారు. యువతకు కంప్యూటర్‌ను పరిచయం చేయడమే కాకుండా దేశ ఆర్థిక వ్యవస్థను పటిష్ట పరిచిన ప్రధానిగా చరిత్ర సృష్టించారన్నారు. అంబేడ్కర్ రచించిన రాజ్యాంగాన్ని సమర్థవంతంగా అమలు చేసి ప్రజాస్వామ్యాన్ని నిలబెట్టింది కాంగ్రెస్ ప్రభుత్వాలేనన్నారు. కార్యక్రమంలో పీసీసీ కార్యదర్శి బెజవాడ రంగారావు, దేవత సుధాకర్, చింతాడ వెంకటేశ్వరరావు, చామర్తి లీలావతి, మరడాపు రాజు, శ్రీను పాల్గొన్నారు.

నిడదవోలులో ఉచిత వైద్య శిబిరం

నిడదవోలు, మే 21: రోటరీ క్లబ్ నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని మున్సిపల్ ఛైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. నిడదవోలులోని రోటరీ ఆడిటోరియమ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో సిరి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సిద్ధార్థ కన్నాజి, రాఘవ సూపర్ స్పెషాలిటీ డెంటల్‌కేర్ అధినేత డాక్టర్ ఎమ్.రాఘవేంద్ర, లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు పలువురికి సేవలం దించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, పోలదాసు శ్రీనివాసరావు, యాసరపు రామకృష్ణ, గుంటుపల్లి శివకుమార్, గోపిరెడ్డి శ్రీనివాస్, రామారావు పాల్గొన్నారు.



చిన్నారులకు టీకాలు తప్పనిసరి

రాజమహేంద్రవరం అర్బన్, మే 21 : జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు, మాతాశిశు సంరక్షణ కార్యకర్తలు వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాలతో పాటు ఆరోగ్య కార్యక్రమాల టార్గెట్లను ప్రతినెలా నూరుశాతం పూర్తి చేయాలని డీఎంహెచ్‌వో వెంకటేశ్వరరావు ఆదేశించారు.రాజమహేంద్రవరం శ్రీ వెంకటేశ్వరా ఆనం కళాకేంద్రంలో మంగళవారం వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమంపై వర్క్‌షాప్ నిర్వహించారు. ఐదేళ్లలోపు పిల్లలకిచ్చే వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాలను తప్పనిసరిగా పూర్తి చేయాలన్నారు.



కృష్ణబాబు ఇక లేరు

- అనారోగ్యంతో హైదరాబాద్‌లో చికిత్స పొందుతూ తుదిశ్వాస
- కొవ్వూరు ఎమ్మెల్యేగా ఐదుసార్లు ఎన్నిక

కొవ్వూరు నియోజకవర్గ ప్రజలు పెద్దాయనగా పిలుచుకునే పెండ్యాల కృష్ణబాబు మృతితో తీవ్ర విషాదం నెలకొంది.. మంచి నాయకుడిని కోల్పోయాం అని రాజకీయ నాయకులు అంటుంటే.. మంచి మనిషిని కోల్పోయాం అంటూ ప్రజలు కన్నీటిపర్యంతమవుతున్నారు.. ఎన్‌టీఆర్ పిలుపుతో 1982లో రాజకీయాల్లోకి వచ్చిన ఆయన టీడీపీ నుంచి ఐదు సార్లు కొవ్వూరు ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డు సృష్టించారు. కావడానికి దొమ్మేరు జమిందార్ అయినా ఏదైనా కష్టం వచ్చిందని ఎవరైనా వెళితే సాయం అందించేవారు.. అందుకే తిరుగులేని నేతగా ఎదిగారు.. పశ్చిమ రాజకీయాలనే శాసించే స్థాయికి చేరారు.. ఉమ్మడి పశ్చిమలో ఆయన ఎవరు పేరు చెబితే వారికే ఎమ్మెల్యే టిక్కెట్ ఇచ్చేవారు.. అలా ఆయన భిక్షతో రాజకీయంగా ఎదిగిన వారు ఎందరో ఉన్నారు.. నాడు ఎన్‌టీఆర్, తరువాత చంద్రబాబుకు అత్యంత సన్నిహితుడిగా ఉండేవారు. ఆయన ఇకలేరని తెలిసి పశ్చిమ జిల్లాలో తీవ్ర విషాదంలో నెలకొంది. ఆయన మృతికి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, హోం మంత్రి తానేటి వనిత తీవ్ర సంతాపం తెలిపారు. - వివరాలు 7లో

నేటి నుంచి ఆరోగ్య శ్రీ సేవలు బంద్

- ప్రైవేట్ ఆసుపత్రుల్లో నిలిచిపోనున్న వైద్యసేవలు
- బిల్లుల బకాయిలే కారణం



రాజమహేంద్రవరం అర్బన్, మే 21 : జిల్లాలో ఆరోగ్యశ్రీ వైద్యసేవలు అందించే ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల్లో బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ వైద్యసేవలు నిలిచిపోనున్నాయి. చికిత్సల బిల్లు బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో ఆరోగ్యశ్రీ వైద్య సేవలను నిలిపివేయాలని ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు నిర్ణయించినట్టు చెబుతున్నారు. కొవిడ్ - 19 చికిత్సల బిల్లులతో పాటు రెండు, మూడు సంవత్సరాలుగా ఆరోగ్యశ్రీ బిల్లులను చెల్లించకపోవడంతో బకాయిలు చెల్లించాలంటూ ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాలు కోరుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదు. దీంతో వైద్యసేవలను నిలుపుదల చేయాలని నిర్ణయించినట్టు సమాచారం. ఒక్క తూర్పుగోదావరి జిల్లాలోనే సుమారు రూ.100 కోట్ల మేర బకాయిలు చెల్లించాల్సి ఉందని తెలిసింది. జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేట్‌లో ఆరోగ్యశ్రీ నెట్ వర్క్ ఆసుపత్రులు 93 ఉన్నాయి. వీటిలో 36 ఆసుపత్రులు ప్రైవేట్ నెట్ వర్క్ ఆసుపత్రులుగా కొనసాగుతున్నాయి. ఈ ఆసుపత్రులన్నింటిలోనూ ఈనెల 22వ తేదీ బుధవారం నుంచి ఆరోగ్యశ్రీ వైద్యసేవలు నిలిచిపోయే అవకాశం ఉంది. ఇదిలా ఉంటే ఆరోగ్యశ్రీ వైద్యసేవలు నిలిపివేస్తామంటూ జిల్లా ప్రైవేట్ నెట్‌వర్క్ ఆసుపత్రుల యాజమాన్యాల అసోసియేషన్ నుంచి మంగళవారం రాత్రి వరకూ తమకు ఎలాంటి సమాచారం రాలేదని జిల్లా ఆరోగ్యశ్రీ అధికారి కార్యాలయం వర్గాలు చెబుతున్నాయి. వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు చెల్లించకపోవడంతో ఐదేళ్లలో సుమారుగా నాలుగుసార్లు వైద్య సేవలు బంద్ చేసినట్టు సమాచారం.

పేదోడికి పప్పన్నం కరువాయె!



- పేదోళ్ల కందిపప్పుకు వైసీపీ ఎసరు
- ఐదు నెలలుగా రేషన్‌లో పంపిణీ నిల్
- మార్కెట్‌లో కేజీ రూ.175 నుంచి రూ.200
- జిల్లాలో 5.73 లక్షల కుటుంబాలకు అందలేదు

(రాజమహేంద్రవరం- ఆంధ్రజ్యోతి)

పేదోళ్ళ కందిపప్పుకు వైసీపీ ప్రభుత్వం గండికొట్టింది. మార్కెట్‌లో పప్పుధరలు మండిపోతున్న సమయంలో పేదలకు అండగా ఉండాల్సిన ప్రభుత్వం చేతులెత్తేసి పేద కుటుంబాల్లో పప్పులేకుండా చేసింది. ప్రస్తుతం జిల్లాలోని వివిధ మార్కెట్లలో కేజీ కందిపప్పు రూ.175 వరకూ విక్రయిస్తున్నారు. సాధారణంగా మార్కెట్‌లో నిత్యావసర సరుకుల ధరలు పెరిగినప్పుడు ప్రభుత్వం రాయితీలు ఇచ్చి ఆదుకుంటుంది. కానీ వైసీపీ ప్రభుత్వం మాత్రం పేదల కడుపుకొట్టింది. గతేడాది అక్టోబరు నుంచే కందిపప్పు సరఫరా తగ్గించారు. హాస్టల్, అంగన్‌వాడీలకు కొంతవరకూ సరఫరా చేస్తున్నారు. గత డిసెంబర్‌లో జిల్లాలో కొద్ది ప్రాంతంలో మాత్రమే అడిగిన వారికి ఇచ్చేవారు. రెండు నెలల నుంచి మొత్తం ఎంఎల్ పాయింట్లన్నీ ఖాళీ. కందిపప్పు ఊసెత్తడం లేదు. డీలర్లు మాత్రం డిసెంబరు నుంచే మాకు కందిపప్పు సరఫరా చేయడం మానేశారని చెప్పడం గమనార్హం. జిల్లాలో 5.73 లక్షల రేషన్‌కార్డులు ఉన్నాయి. వాటన్నింటికీ ఒక్కో రేషన్‌కార్డుకు రూ.కేజీ వంతున కందిపప్పు అమ్మేవారు. దీని ధర రూ.67 ఉండేది. ఇది ప్రజలకు బాగా ఉపయోగపడేది. ఇవాళ మార్కెట్‌లో కందిపప్పు కొనలేక పేద, మధ్యతరగతి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. సూపర్ మార్కెట్లలో కేజీ పప్పు ధర రూ.200 దాటేసింది. మార్కెట్‌లో నియంత్రణ లేకపోవడం వల్ల ఎవరి ఇష్టానుసారం వారు అమ్మేస్తున్నారు. ఎన్నికల ముందు కూడా ప్రభుత్వం ప్రజలను పట్టించుకోలేదు. అధికారులు మాత్రం ఇంకా కందిపప్పు పంపిణీ చేస్తున్నామని బొంకుతున్నారు. ఎక్కడ ఎవరికి ఇస్తున్నారని ఆరా తీస్తే రెండునెలల నుంచి పప్పు అందడం లేదని ప్రజలు చెబుతున్నారు. మొత్తం మీద నెలకు జిల్లాకు 573 టన్నుల కందిపప్పు అవసరం. ఇంటింటికీ రేషన్ అని గొప్పలు చెబుతూ వైసీపీ ఒక్కొక్కటి వంతున రేషన్ తగ్గించుకుంటూ వస్తుంది. ఈ నెలలో గోధుమపిండి ఇవ్వడంలేదు. ప్రస్తుతం బియ్యం, అరకేజీ పంచదార మాత్రమే ఇస్తున్నారు.గత తెలుగుదేశం ప్రభుత్వంలో బియ్యం, పంచదార, కందిపప్పు, వంటనూనె వంటివి ఇచ్చేవారు. ఇవాళ బియ్యం సక్రమంగా సరఫరా చేయలేని పరిస్థితి. గత నెలలో కొంతమందికే బియ్యం ఇచ్చారు. బియ్యం కోసం అనేకమంది రేషన్‌షాపులు, ఎండీయూ వాహనాల చుట్టూ తిరిగారు. కొద్ది నెలల కిందట ప్రధాని మోదీ మరో మూడేళ్ల పాటు ఉచిత బియ్యం పంపిణీ చేస్తామని ప్రకటించిన సంగతి తెలిసిందే.వైసీపీ ప్రభుత్వం దానిని ఇప్పటి వరకూ అమలు చేయలేని పరిస్థితిలో ఉండడం గమనార్హం.

విజిట్రబుల్స్



- కూరగాయల ధరలకు రెక్కలు
- ఘాటెక్కిన పచ్చిమిర్చి
- కిలో రూ.80పైనే
- వంగ, బీర, బెండదీ ఇదే దారి
- ఎండ, వానలతో పంటకు నష్టం
- ఆకుకూరలపై తీవ్ర ప్రభావం

రాజమహేంద్రవరం అర్బన్, మే 21 : కూరగాయల ధరలకు రెక్కలు వచ్చాయి. ధరలు పై పైకి దూసుకెళుతున్నాయి. పచ్చిమిర్చి ఘాటెక్కి బహిరంగ మార్కెట్లో కిలో రూ.80లు దాటేసింది. ఇదే దారిలో వంకాయలు, బీరకాయలు, బెండకాయల ధరలు పరుగులు పెడుతున్నాయి. ఒక పక్క తీవ్రమైన ఎండలు, మరో పక్క గాలివానలతో పంటలు దెబ్బతిని దిగుబడులు పడిపోతున్నాయి. రావులపాలెం సమీపంలోని మడికి, రాజమహేంద్రవరం హోల్‌సేల్ మార్కెట్లకు ఆశించినస్థాయిలో సరుకు రావడంలేదని రైతులు, వ్యాపారులు చెబుతున్నారు. రెండు వారాల కిందట వరకూ ధరలు కాస్త అదుపులోనే ఉన్నట్టు కనిపించినా కొద్దిరోజుల కిందట కురిసిన భారీ వర్షం, గాలులతో కూరగాయల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. ఆ తర్వాత కూడా వర్షాలు వెన్నాడడంతో కూరగాయల సాగుకు గడ్డు పరిస్థితులు ఏర్పడ్డాయి. దీంతో మార్కెట్‌లో డిమాండ్‌కు అనుగుణంగా సరుకులేక ధరలు పెరుగుతున్నాయి.

మిర్చి ఘాటు.. చిక్కుళ్లు రేటు..

బహిరంగ మార్కెట్లలో రిటైల్ వ్యాపారుల వద్ద ధరలు మండిపోతున్నాయి. ఇక్కడ పచ్చిమిర్చి కిలో రూ.80ల పైనే పలుకుతోంది. ఒకటి, రెండు రోజుల్లో రూ.100 దాటొచ్చని చెబుతున్నారు. కడప జిల్లా మైదుకూరు ప్రాంతం నుంచి వచ్చే మిర్చి దిగుమతులు తగ్గడంతో శ్రీకాకుళం, జగదల్‌పూర్ ప్రాంతాల నుంచి మిర్చి దిగుమతి చేసుకుంటున్నారు. చిక్కుళ్లు కిలో రూ.140ల ధర ఉండడం గమనార్హం. వంకాయలు దొమ్మేరు రకం రూ.60-రూ.80లు ధర ఉంది. నలుపు, తెలుపు చార, గులాబీ రకాలు కూడా కిలో రూ.60 వరకూ ఉన్నాయి. బీరకాయలు, బెండకాయల ధరలు దాదాపుగా ఇలానే ఉన్నాయి. దొండకాయల ధర మాత్రం కాస్త తక్కువగా కిలో రూ.40 ఉంది. రాజమహేంద్రవరం సమీపంలోని సీతానగరం మండలంలో పలు ప్రాంతాల్లో రైతులు బీర, బెండ, దొండసాగు కొంత వరకూ చేపడుతున్నా మార్కెట్ అవసరాలకు సరిపోవడంలేదు. దీంతో ఇతర ప్రాంతాల నుంచి సరుకు దిగుమతి చేసుకోవాల్సి వస్తోంది. టమాటా కూడా రూ.40ల వరకూ ఉంది. లోకల్‌గా సాగుచేసే నాటు రకం సీజన్ ముగియడంతో టమాటాను మదనపల్లి నుంచి ఇక్కడ మార్కెట్లకు తెస్తున్నారు. చేమదుంపలు, క్యాప్సికం, బొబ్బర్లు, కాకరకాయలు, కంద ధరలు ఎక్కువగానే ఉన్నాయి.

ఆకు కూరలు.. మరీ దారుణం..

రాజమహేంద్రవరం, మడికి హోల్‌సేల్ మార్కెట్లలో ఆకు కూరలు పెద్దగా కనిపించడంలేదు. ప్రతికూల వాతావరణం కారణంగా మార్కెట్ అవసరాలను చాలా వరకూ తీర్చే తాళ్లపూడి మండలం పెద్దేవం ప్రాంతం నుంచి ఆకుకూరలు మార్కెట్‌కు రావడం బాగా తగ్గిపోయింది. పెద్దేవం నుంచి కొత్తిమీర అసలు రావడమే లేదు. హోల్‌సేల్, రిటైల్ మార్కెట్లు రైతుబజార్లలో బెంగుళూరు కొత్తిమీర మాత్రమే లభ్యమవుతోంది. మెంతికూర మార్కెట్‌లో దాదాపుగా కనిపించడంలేదు. గోంగూర, తోటకూర, పొన్నగంటికూర మాత్రమే కాస్త పచ్చగా కనిపిస్తున్నాయి. చుక్కకూర, పాలకూర కాస్త వస్తున్నా ఆకుల చాలా వరకూ పాడైన స్థితిలో ఉంటున్నాయి. ఎండలు, వర్షాలకూ ఆకుకూరలన్నీ బాగా దెబ్బతినడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.వర్షాలు ఎక్కువగా పడితే కూరగాయల ధరలు ఇప్పట్లో దిగిరాకపోవచ్చని, ఆకు కూరల పరిస్థితీ ఇంతేనని రైతులు, వ్యాపారులు, మార్కెటింగ్‌శాఖ అధికారులు చెబుతున్నారు.

విద్యార్థులు ఒత్తిడి అధిగమించేందుకే పాల్ ల్యాబ్‌లు ఏర్పాటు

ఎస్ఎస్ఏ అధికారి శ్రీనివాసులు రెడ్డి

రాజమహేంద్రవరం సిటీ,మే 21 : పాల్ లాబ్ ద్వారా ఆదర్శవంతమైన విద్యావాతావరణం రూపొందించాలని రాష్ట్ర సమగ్ర శిక్ష అదనపు పథక సంచాలకులు బి.శ్రీనివాసులు రెడ్డి అన్నారు. రాజమహేంద్రవరం ట్రైనింగ్ కాలేజీలో మంగళవారం పాల్ ల్యాబ్ ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణిత, ఆంగ్ల ఉపాధ్యాయులతో ఒక రోజు శిక్షణ నిర్వహించారు. పాల్ ల్యాబ్ (పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్) లు సంప్రదాయ బోధనా విధానాల్లో కొనసాగుతున్న అభ్యాస అవాంతరాలు ఒత్తిడిని అధిగమించడమే లక్ష్యంగా ఏర్పడ్డాయన్నారు. గత విద్యా సంవత్సరంలో ఏర్పడిన లోటు పాట్లను సవరించుకొని రానున్న విద్యాసంవత్సరంలో జిల్లా స్థాయిలో పాల్ ల్యాబ్‌లను సమర్థవంతంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు రెమిడియల్ టీచింగ్ ద్వారా సందేహాలు నివృత్తి చేయాలన్నారు. శిక్షణలో రాష్ట్ర కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఏడీ శ్రీనివాస్‌సింగ్, జోన్ -2 ప్రాంతీయ విద్యా సంచాలకులు బి.నాగమణి, జిల్లా పాఠశాల విద్యాశాఖ అధికారి కె వాసుదేవరావు, జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, రాష్ట్ర పాల్ ల్యాబ్ కోఆర్డినేటర్ బి.కిషోర్, రాష్ట్ర పరిశీలకురాలు నాగమణి, జిల్లా సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు ఏఎంవో గౌరీశంకర్, సీఎంవో శ్రీనివాసరావు, ఏఎస్‌వో వైవి ప్రసాద్, డీవైఈవో ఈవిబిఎస్ నారాయణ, ఐఈ కోఆర్డినేటర్ కనకబాబు, డీఈవో కార్యాలయం ఏఎస్‌ఓ ప్రసాద్, సురేష్, కాకినాడ, తూర్పుగోదావరి జిల్లాల పాల్ ల్యాబ్ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇసుక మాఫియాకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలి

సుప్రీంకోర్టుకు ముప్పాళ్ల సుబ్బారావు అప్పీల్

రాజమహేంద్రవరం, మే 21(ఆంధ్రజ్యోతి) : గోదావరిలో ఇసుక అక్రమాలకు పాల్పడుతున్న ఇసుక మాఫియా, వారికి సహకరిస్తున్న అధికారుల మీద చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ పౌరహక్కుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ముప్పాళ్ల సుబ్బారావు సుప్రీంకోర్టు, హైకోర్టు, గ్రీన్ ట్రిబ్యునల్‌తో పాటు, ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ మేరకు ఆయన మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సుప్రీంకోర్టు, హైకోర్టు ఆదేశించినా పట్టించుకోకపోవడాన్ని సీరియస్ పరిగణించాలని కోరారు. అఖండగోదావరిలో ఇప్పటికే అక్రమంగా జరుగుతున్న డ్రెడ్జింగ్ ఫొటోలతో పాటు కోర్టుకు ఆధారాలు అందజేసినట్టు పేర్కొన్నారు. ఇక్కడ సెబ్, రెవెన్యూ, పోలీస్,ఇరిగేషన్, మైనింగ్ తదితర శాఖల అధికారులంతా మాఫియాతో కుమ్మక్కయ్యారని వివరించారు.

కౌంటింగ్‌కు సిద్ధంకండి

- ముందస్తు కార్యాచరణ అవసరం
- బాణసంచా విక్రయాలు నిషేధించండి
- కలెక్టర్, ఆర్‌వోలతో సీఎస్ సమీక్ష

రాజమహేంద్రవరం సిటీ, మే 21 : జిల్లాలో జూన్ 4న జరిగే కౌంటింగ్ ప్రక్రియలో లాండ్ ఆర్డర్ సమస్యలు తలెత్తకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి జవహర్ రెడ్డి ఆదేశాలు ఇచ్చారు. జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులతో మంగళవారం వీడియోకాన్ఫరెన్స్ నిర్వహించారు. కౌంటింగ్‌కు ముందస్తు కార్యాచరణతో సిద్ధంగా ఉండాలన్నారు. కేంద్రంలో నిరంతర విద్యుత్ సరఫరా అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకు బాణసంచా విక్రయాలు నిషేధించాలని ఆదేశించారు. ముఖ్యంగా జిల్లాలో తాగునీటి సమస్యలు తలెత్తకుండా సమన్వయ శాఖల అధికారులతో కార్యాచరణ ప్రణాళికతో చర్యలు తీసుకోవాలన్నారు.



సీఎస్ వీసీలో కలెక్టర్, ఇతర అధికారులు

జిల్లా అధికారులతో కలెక్టర్ సమీక్ష

జిల్లా అధికారులతో కలెక్టర్ మాధవీలత సమీక్షించారు. జూన్ 4 జరిగే ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియకు సంబంధించి అధికారులకు పలు ఆదేశాలు ఇచ్చారు. చీఫ్ సెక్రటరీ ఆదేశాల మేరకు సున్నితత్వం కలిగిన ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలన్నారు. కౌంటింగ్ రోజున బాణసంచా కాల్చకుండా పోలీస్ శాఖ చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ పథకం (ఎన్‌ఆర్‌ఈజీఎస్) కింద మే 2024 నాటికి 21.41 లక్షల పనిదినాలు లక్ష్యం దిశగా ప్రణాళిక సిద్ధం చేశామన్నారు. ఇప్పటి వరకు 11.21 లక్షల పనిదినాల లక్ష్యాలను సాధించామన్నారు. మే 18వ తేదీన ఉపాధి కూలీలు 48,739 మంది హాజరుకాగా రోజుకు సగటున 5,680 మందికి ఉపాధి కల్పించామన్నారు. రోజుకు సగటున వేతనం రూ.249.41 ఇస్తున్నట్టు తెలిపారు. రానున్న వర్షాకాలం దృష్టిలో పెట్టుకొని మరింతగా పని దినాలు కల్పించడంపై దృష్టి పెట్టాలని ఆదేశించారు. జిల్లాలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. రానున్న రోహిణి కార్తెను దృష్టిలో పెట్టుకుని విద్యుత్ లోవోల్టేజ్ సమస్య లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.

జిల్లాలో సెక్షన్ 144,30 అమలు

- 'తూర్పు'లో విస్తృతంగా కార్డన్ సెర్చ్
- ఎస్పీ జగదీశ్ స్వీయ పర్యవేక్షణ

రాజమహేంద్రవరం, మే 21(ఆంధ్రజ్యోతి): ఓట్ల కౌంటింగ్ దగ్గర పడుతుండడంతో తూర్పుగోదావరి పోలీసులు అత్యంత పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టారు. శాంతి భద్రతలకు ఎలాంటి విఘాతం కలగకుండా ఇప్పటికే సీఆర్‌పీసీ సెక్షన్ 144, పోలీస్ చట్టం సెక్షన్ 30 అమల్లోకి తెచ్చారు. ఎస్పీ జగదీశ్ నిరంతరాయంగా సిబ్బందికి సూచనలిస్తూ శాంతి భద్రతలను పర్యవేక్షిస్తున్నారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో ప్రతి రోజూ కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ చేపడుతున్నారు. అనుమానితులను ప్రశ్నించడంతో పాటు సరైన పత్రాలు లేని వాహనాలు, అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు. బహిరంగ సభలు, సమావేశాలకు అనుమతులు ఇవ్వడం లేదు. ఆటోలకు మైక్‌లు ఏర్పాటు చేసి పోలీసు హెచ్చరికలను అనౌన్స్ చేస్తున్నారు.బంకుల్లో పెట్రోలు, డీజిల్ లూజు అమ్మకాలు చేయవద్దని, బాటిళ్లలో ఎట్టి పరిస్థితుల్లో నింపవద్దని ఆదేశాలిచ్చారు. పాత నేరస్తులపై నిఘా పెట్టడంతో పాటు రాత్రి వేళల్లో, అనుమానిత ప్రాంతాల్లో గస్తీ పెంచి నిఘా పటిష్ఠం చేశారు.సోమవారం కడియం స్టేషన్ పరిధిలో ఒక వ్యక్తిపై అక్రమ మద్యం కేసు నమోదు చేశారు.బాణసంచా కేంద్రాలకు సూచనలు చేశారు. ఉత్సవాల పేరుతో బాణసంచా కాల్చడాన్నీ నిషేధించారు.

రైల్వే స్టేషన్‌లో మరమ్మతు పనులు

- రూ.1.80 కోట్లతో పనులు ఆరంభం
- డీఈఎన్ స్వీయ పర్యవేక్షణ

రాజమహేంద్రవరం, మే 21(ఆంధ్రజ్యోతి): రాజమండ్రి ప్రధాన రైల్వే స్టేషనులో ట్రాక్ మరమ్మతు పనులు వేగంగా జరుగుతున్నాయి. విజయవాడకు చెందిన సూర్యదేవర కన స్ట్రక్షన్స్ కంపెనీ ఈ పనులను రూ.1.80 కోట్లతో చేపట్టింది. ఈ నెల 6న గూడ్స్ రైలు రెండో ప్లాట్‌ఫాం వద్ద పట్టాలు తప్పిన విషయం తెలిసిందే. ఆ మరుసటి రోజున విజయవాడ నుంచి డీఆర్‌ఎం నరేంద్ర ఎ.పాటిల్ నేతృత్వంలో ఉన్నతస్థాయి అధికారుల బృందం వచ్చి ట్రాక్‌లను క్షుణ్ణంగా పరిశీలించింది. ఒకటి, రెండు ప్లాట్‌ఫాం పట్టాల కింద స్లీపర్ల(సిమెంటు కమ్మీలు)ను మార్చాలని నిర్ణయించారు. మొదటిగా రెండో ప్లాట్‌ఫాం వద్ద ప్రొక్లెయినర్లతో స్లీపర్లను తొలగిస్తున్నారు. సమాంతరంగా ఒకటో ప్లాట్‌ఫాం పనులను ప్రారంభించారు. రెండు ప్లాట్‌ఫాం ట్రాకుల స్లీపర్లను తొలగించి కొత్తవి వేస్తున్నారు. స్లీపర్ల కింద కూడా బేస్‌ను పటిష్టం చేస్తున్నారు. పనుల కారణంగా రెండో ప్లాట్‌ఫాంపై ట్రాఫిక్‌ని నిలిపివేశారు.ఈ ట్రాక్‌పై ట్రాఫిక్‌ని అనుమతించిన తర్వాత మొదటి ప్లాట్‌ఫాంపై రైళ్ల రాకపోకలను నిలిపి వేయనున్నారు. రెండు ట్రాక్‌ల మధ్య డ్రైనేజీ వ్యవస్థను కూడా మెరుగు పరుస్తు న్నారు. మొత్తం పనులు పూర్తి కావడానికి నెల రోజులు పట్టే అవకాశం ఉంది. మరమ్మతు పనులను డీఈఎన్ రవికుమార్ సమ్మి విజయవాడ నుంచి వచ్చి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే 4, 5 ప్లాట్ ఫాంలు అందుబాటులోకి రావడంతో రైళ్ల రాకపోకలకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. సాధా రణంగా పదేళ్లకోసారి ఈ పనులు చేయాల్సి ఉంది. కానీ అలా జరగకపోవడంతో పట్టాల కింద బేస్ సామర్థ్యం తగ్గి రైలు పట్టాలు తప్పే వరకూ పరిస్థితి వచ్చింది. ఒకటి, రెండు ట్రాక్ లకు సంబంధించి కొంత భాగం 2008లో, మరికొంత 2013లో పనులు పూర్తి చేశారు. ట్రాక్‌ల వద్ద డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా పాడైపోయింది. ప్రతి రోజూ మొత్తం 160 రైళ్లు రాకపో కలు సాగిస్తాయి.22 టన్నుల యాక్సిల్ లోడ్‌తో ప్రయాణిస్తుంటాయి.



రాజమండ్రి రైల్వే స్టేషన్ రెండో ప్లాట్‌ఫాంపై పనులు



పండిత సదస్యం కార్యక్రమంలో పండితులు

సత్యదేవాయనమః

- ఘనంగా పండిత సదస్యం
- వేదఘోషతో పులకించిన సత్యదేవుడి సన్నిధి

అన్నవరం, మే 21: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధి మంగళవారం వేదఘోషతో పులకించింది. రాష్ట్రం నలుమూలల నుంచి వేదాల్లో నిష్ణాతులైన పండితులు తమ వేదవిద్యను స్వామి వారి పాదాలచెంత ఉంచి పునీతులయ్యారు. స్వామి దివ్యకల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం సాయంత్రం పండిత సదస్యం ఘనంగా జరిగింది.మధ్యాహ్నం 3గంటలకు నవవధూవరులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్లను మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ అనివేటి మండపం వద్దకు తోడ్కొని వచ్చారు. సర్వాంగసుందరంగా అలంకరించిన వేదికపై ఆశీనులు గావించి మరో వేదికపై క్షేత్రపాలకులు సీతారాములను ఉంచి ప్రధానార్చకుడు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో గణపతిపూజ, పుణ్యాహవచనం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. పండితులంతా తమ పాండిత్యంతో మైమరిపింపచేశారు. అనంతరం రాష్ట్రం నలుమూలల నుంచి విచ్చేసిన సుమారు 100మంది పండితులను పూలమాలలు, దుశ్శాలువా కప్పి, వినినకర్రను అందజేసి నగదు పురస్కారాలను ఈవో రామచంద్రమోహన్, చైర్మన్ రోహిత్‌లు అందజేశారు. కార్యక్రమం అనంతరం పండితులంతా నవ దంపతుకు వేదాశీర్వచనాలు అందజేశారు.





పండితులను సత్కరిస్తున్న ఈవో రామచంద్రమోహన్

పొన్నవాహనంపై విహారం

సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి సత్యదేవుడు, అనంతలక్ష్మి నవదంపతులు పొన్నవాహనంపై విహరించారు. చైర్మన్ రోహిత్ కొబ్బరికాయ కొట్టి కార్యక్రమం ప్రారంభించారు.సాంస్కృతిక కార్యక్రమాల మధ్య గ్రామోత్సవం వైభవంగా జరిగింది.

నేడు చక్రస్నానం కోసం ఏర్పాట్లు

సత్యదేవుడి దివ్యకల్యాణోత్సవాల్లో ముఖ్య ఘట్టాల్లో ఒక్కటైన చక్రస్నానం నిర్వహణకు అధికారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నారు. ఈ ఏడాది పంపా రిజర్వాయర్‌లో నీటిమట్టం లేకపోవడం, పుష్కరజలాలకు ప్రయత్నించినా అది సాధ్యపడకపోవడంతో ఉన్న కొద్దిపాటి నీటితో చిన్నకొలను ఏర్పాటుచేసి నీటిని కొలనులోకి ప్రత్యేకమార్గం ద్వారా నీటితో నింపుతున్నారు.బుధవారం చక్రస్నానం జరగనుంది.

దేవరపల్లిలో 226 రాగి దిమ్మలు స్వాధీనం

నలుగురు అరెస్టు

8

నయా మామిడి

- మార్కెట్లోకి కొత్త రకాలు
- కడియం నర్సరీల్లో లభ్యం

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి • కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం

బాటిళ్లు, డ్రమ్ముల్లో పెట్రోల్ అమ్మితే కఠిన చర్యలు

డీఎస్పీ రామారావు.. దేవరపల్లిలోని పెట్రోల్ బంకుల పరిశీలన



దేవరపల్లిలో బంక్ వద్ద విలేకర్లతో మాట్లాడుతున్న డీఎస్పీ రామారావు

దేవరపల్లి, మే 21: బంకుల వద్ద బాటిళ్లు, డ్రమ్ముల్లో పెట్రోల్ అమ్మితే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. మంగళవారం దేవరపల్లిలోని పెట్రోల్ బంకులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికలు ముగిసిన అనంతరం కొన్ని జిల్లాల్లో ఘర్షణలు జరిగాయని, శాంతిభద్రతలకు అంతరాయం ఏర్పడకుండా జూన్ 15వరకు పెట్రోల్ బంకుల్లో, బయట షాపుల వద్ద పెట్రోల్ బాటిల్స్ కలిగి ఉన్న వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీఐ బాలసురేష్‌బాబు, ఎస్ఐ శ్రీహరిరావు సిబ్బంది పాల్గొన్నారు.

మదన గోపాలస్వామి కల్యాణోత్సవం

నల్లజర్ల, మే 1: అనంతపల్లిలో శ్రీ రుక్మిణి,సత్యభామ సమేత మదన గోపాల స్వామి వార్షిక కల్యాణోత్సవం మంగళవారం రాత్రి మండపం వద్ద వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ చైర్మన్ కానుబోయిన గంగాధరరావు, ఈవో లక్ష్మీశరణ్యలు పూజాధికాలు నిర్వహించి స్వామి,అమ్మవార్లకు పట్టు వస్త్రాలు సమర్పించారు. భక్తుల అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈనెల 19న ఏకాదశి రోజున ప్రారంభమైన ఈ ఉత్సవాల్లో భాగంగా 22న రథోత్సవం, 24న పవళింపు సేవ జరుగుతాయని ఆలయ అర్చకులు తెలిపారు.

నిడదవోలులో ఉచిత వైద్య శిబిరం

నిడదవోలు, మే 21: రోటరీ క్లబ్ నిర్వహించే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగపర్చుకోవాలని మున్సిపల్ చైర్మన్ భూపతి ఆదినారాయణ అన్నారు. నిడదవోలులోని రోటరీ ఆడిటోరియమ్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన మల్టీ స్పెషాలిటీ వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. శిబిరంలో సిరి హాస్పిటల్స్ అధినేత డాక్టర్ సిద్ధార్థ కన్నాజి, రాఘవ సూపర్ స్పెషాలిటీ డెంటల్‌కేర్ అధినేత డాక్టర్ ఎమ్.రాఘవేంద్ర, లయన్స్ కంటి ఆసుపత్రి వైద్యులు పలువురికి సేవలందించారు. కార్యక్రమంలో రోటరీ అధ్యక్షుడు కీర్తి ఆంజనేయులు, పోలదాసు శ్రీనివాసరావు, యాసరపు రామకృష్ణ, గుంటుపల్లి శివకుమార్, గోపిరెడ్డి శ్రీనివాస్, గొన్నాబత్తుల రామారావు, పొన్నా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

ఉండ్రాజవరం, మే 21: తమ కుమారుడు రాజేష్ కనిపించడంలేదని మండలంలోని చివటం గ్రామానికి చెందిన పామర్తి చిరంజీవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈనెల 19న ఉదయం 11గంటలకు తాడేపల్లిగూడెంలో ఉల్లిపాయలు కొనుగోలు చేయడానికి ట్రక్కు ఆటోతో వెళ్లి తిరిగి రాలేదని పేర్కొన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ వి.అప్పలరాజు తెలిపారు.

విద్యుత్ ఉద్యోగుల ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్

అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక ఏకగ్రీవం



జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్‌గా నియామకపత్రం అందుకుంటున్న శ్రీనివాసరావు

గోపాలపురం, మే 21: ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల విద్యుత్ ఉద్యోగుల ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యుల ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. ఏలూరులో కబర్డీహాలులో ఈ నెల 18న విద్యుత్ ఉద్యోగుల ఎస్సీ, ఎస్టీ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎన్నిక జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా జీఏటీ పాల్, ప్రాంతీయ కార్యదర్శిగా ఎస్.వెంకట్రావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గోపాలపురం టౌన్ లైన్‌మ్యాన్ చింతలపూడి శ్రీనివాసరావు, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శిగా ఈదా రాంబాబు, ఉపాధ్యక్షులుగా వి.సునీల్‌కుమార్, కప్పల సురేష్, ఎం.రవిప్రసాద్‌లతో పాటు ఇతర కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్టు జిల్లా నూతన వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాసరావు తెలిపారు. ఎన్నికల పర్యవేక్షకుడిగా ఏపీఈపీడీసీఎల్ జనరల్ సెక్రటరీ సీహెచ్.సాయిబాబా వ్యవహరించారన్నారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ జిల్లాలో విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. తన నియామకానికి కృషి చేసిన ఉద్యోగులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

టీపొడి రీ-ప్యాకింగ్ షాపుల్లో విజిలెన్స్ తనిఖీలు



తనిఖీలు చేస్తున్న విజిలెన్స్ అధికారులు

రాజమహేంద్రవరం, మే 21(ఆంధ్ర జ్యోతి): టౌన్ హాలు రోడ్డులోని టీపొడి రీప్యాకింగ్ దుకాణాల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది తనిఖీలు చేశారు. రీజనల్ విజిలెన్స్ ఎస్పీ కేఎస్ఎస్‌వీ సుబ్బారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీ తేజ అస్సాం టీ, కీర్తి అస్సాం టీ, అస్సాం టీ కంపెనీల్లో సోదాలు చేశారు. నిషేధ సింథటిక్ ఫుడ్ కలర్ టార్టాజైన్, సన్ సెట్ పసుపులను టీ పొడిలో కలపడంతో నమూనాలను సేకరించి విశ్లేషణ నిమిత్తం ల్యాబ్‌కి పంపించారు. ప్యాకింగ్ లైసెన్సు, కన్స్యూమర్ కేర్ వివరాలు లేకపోవడం, గృహ వినియోగ గ్యాస్ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు వాడడం గుర్తించారు. క్రిమినల్ కేసు నమోదుకు పోలీస్ స్టేషన్‌కి సిఫారసు చేశామని ఎస్పీ చెప్పారు. ఆహార పదార్థాలను కల్తీ చేసినా, నాణ్యతా ప్రమాణాల ప్రకారం వినియోగదారులకు అందించకపోయినా కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. తనిఖీల్లో డీఎస్పీ ముత్యాలు నాయుడు, నాగ వెంకట రాజు, జగన్నాథరెడ్డి, భార్గవ మహేశ్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు నిర్దిష్ట ప్రణాళికతో చదవాలి



పుస్తకాలు చదివిస్తున్న గ్రంథాలయాధికారి రామకోటేశ్వరరావు

రంగంపేట, మే 21: విద్యార్థులు నిర్దిష్ట ప్రణాళిక, ఏకాగ్రతతో చదివి లక్ష్యాన్ని సాధించాలని రంగంపేట గ్రంథాలయాధికారి నల్లమిల్లి రామకోటేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిక్షణ తరగతుల్లో భాగంగా 6వ రోజు నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. విద్యార్థులతో యోగాసనాలు సాధన, ధ్యానం చేయించారు. అనంతరం తెనాలి రామకృష్ణుడు నీతి కథలను, ఐకమత్యం కథలను బోధించారు. కాంపిటేటివ్ విద్యార్థి సీహెచ్ వీరబాబు స్పోకెన్ ఇంగ్లీషుపై శిక్షణ ఇచ్చారు. బాలల గేయాలు ఆలపించారు.

23న రాజశ్యామల యాగం

రాజానగరం(కోరుకొండ), మే 21: ఈ నెల 23న కోరుకొండ మండలం గాదరాడలోని ఓం శక్తిపీఠంలో మహాసుదర్శన సహిత మహాచండీ సహిత రాజశ్యామల యోగం నిర్వహిస్తున్నట్టు నిర్వాహకులు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. తమిళనాడుకు చెందిన 30 మంది పండితులతో మహాచండీ, మహామృత్యుంజయ, రాజశ్యామల, మహా సుదర్శన యాగాలు వైభవంగా నిర్వహించనున్నారు. మరిన్ని వివరాలకు 82978 69999; 82978 79999 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

రేపు బుద్ధ పూర్ణిమ ఉత్సవం

ఉండ్రాజవరం, మే 21: ఉండ్రాజవరంలోని బౌద్ధ దమ్మపీఠంలో ఈనెల 23న బుద్ధ పూర్ణిమ ఉత్సవం నిర్వహించనున్నట్టు పీఠాధిపతి భంతే అనాలయో తెలిపారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని, అలాగే ఇటీవల పదో తరగతి విద్యార్థులకు పాలిటెక్నిక్ ఉచిత కోచింగ్ ఇవ్వగా వాటి ఫలితాల్లో టాప్ 10మందికి ప్రతిభా అవార్డులు, కోచింగ్ ఇచ్చిన ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాలు చేపట్టనున్నట్టు చెప్పారు.

టీడీపీకి కృష్ణబాబు ఎనలేని సేవలు

- కొవ్వూరు ద్విసభ్య కమిటీ సభ్యుడు రామకృష్ణారావు
- మాజీ ఎమ్మెల్యే మృతికి పలువురి సంతాపం



కొవ్వూరులో కృష్ణబాబు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

కొవ్వూరు, మే 21: తెలుగుదేశం పార్టీకి పెండ్యాల వెంకట కృష్ణారావు (కృష్ణబాబు) నాలుగు దశాబ్దాల పాటు ఎనలేని సేవలందించారని నియోజకవర్గ ద్విసభ్య కమిటీ సభ్యులు కంటమణి రామకృష్ణారావు అన్నారు. మంగళవారం స్థానిక పార్టీ కార్యాలయంలో కృష్ణబాబు చిత్రపటానికి పూలమాలవేసి శ్రద్ధాంజలి ఘటించారు. రామకృష్ణారావు మాట్లాడుతూ ఐదు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై కొవ్వూరు నియోజకవర్గ అభివృద్ధికి కృషిచేశారన్నారు. జిల్లాలో ఎంతో మందికి రాజకీయ భిక్ష పెట్టారన్నారు. ఎమ్మెల్యేలు, జడ్పీ చైర్మన్లు, డీసీసీబీ చైర్మన్లుగా పదవులు రావడానికి కృషిచేశారన్నారు. కార్యక్రమంలో అర్బన్ బ్యాంకు చైర్మన్ మద్దిపట్ల శివరామకృష్ణ, సూరపనేని చిన్ని, దాయన రామకృష్ణ, సూర్యదేవర రంజిత్, పొట్రు శ్రీనివాసరావు, పాలడుగుల లక్ష్మణరావు, అనుపిండి చక్రధరరావు, అర్జిల్లి రామకృష్ణ, కాగిత రఘు, బూరుగుపల్లి వెంకటేశ్వరరావు, అక్కిన రాంబాబు, మరపట్ల కళాధర్, ఎం.చక్రపాణి, రాజాన శ్రీనివాస్, రంభ హరిబాబు, పాకా జయరామ్, వరిగేటి కాంతరాజు, బొంతా కిషోర్ పాల్గొన్నారు. కృష్ణబాబు మృతికి గోపాలపురం మాజీ ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు, వైసీపీ ఎమ్మెల్యే తలారి వెంకట్రావు సంతాపం తెలిపారు.

చాగల్లు: మాజీ ఎమ్మెల్యే పెండ్యాల వెంకట కృష్ణారావు మృతి ఈ ప్రాంత ప్రజలకు తీరని లోటని ఏఎంసీ మాజీ చైర్మన్ ఆళ్ల హరిబాబు, మాజీ ఎంపీపీ కేతా సాహెబ్ అన్నారు. పారిశ్రామికవేత్తగా ఎందరికో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించారని, మరెందరికో రాజకీయ జన్మను ప్రసాదించిన మహోన్నత వ్యక్తి అని సంతాప సందేశంలో పేర్కొన్నారు. ఆయన మృతికి టీడీపీ నాయకులు నాదెళ్ల శ్రీరామ్‌చౌదరి, కొఠారు అశోక్‌బాబా, కరుటూరి సతీష్, నందిగం శ్రీను, తాళ్లూరి హరిశ్చంద్రప్రసాద్ సంతాపం తెలిపారు. అలాగే కృష్ణబాబు మృతికి వైసీపీ నాయకులు పలువురు సంతాపం తెలిపారు. పార్టీలకతీతంగా ప్రజల కోసమే ఆలోచించే నాయకుడని గారపాటి శ్రీనివాసరావు అన్నారు.

ఉండ్రాజవరం: మాజీ ఎమ్మెల్యే కృష్ణబాబు మృతి పట్ల మండలంలోని పలువురు టీడీపీ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మంచితనానికి మారుపేరుగా నిలిచిన వ్యక్తి కృష్ణబాబు అని మాజీ ఎమ్మెల్యే బూరుగుపల్లి శేషారావు, టీడీపీ మండలాధ్యక్షుడు సింహాద్రి రామకృష్ణ, మాజీ జడ్పీటీసీ కోమట్లపల్లి వెంకటసుబ్బారావు తదితరులు సంతాపం తెలిపారు.

దేశం గర్వించదగ్గ నాయకుడు రాజీవ్‌గాంధీ

- కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి
- మాజీ ప్రధాని వర్ధంతి.. పలువురి నివాళి



కొవ్వూరులో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అరుణకుమారి

కొవ్వూరు, మే 21: దేశం గర్వించదగ్గ నాయకుడు రాజీవ్‌గాంధీ అని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు అరిగెల అరుణకుమారి అన్నారు. భారతరత్న, మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ వర్ధంతి మంగళవారం పలుచోట్ల నిర్వహించారు. కొవ్వూరులోని పార్టీ కార్యాలయంలో పట్టణాధ్యక్షుడు గంధం పూజ్య నరసింహ బాపూజీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఆమె రాజీవ్‌గాంధీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజీవ్‌గాంధీ ఆనాడు ప్రవేశపెట్టిన ఆధునిక సాంకేతిక విధానాలే దేశంలో నేటికీ అమలవుతున్నాయన్నారు. ప్రధానిగా దేశంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారన్నారు. 74వ రాజ్యాంగ సవరణ ద్వారా గ్రామ పంచాయతీలకు నేటికీ నేరుగా నిధులు జమవుతున్నాయంటే అది రాజీవ్‌గాంధీ కృషేనన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు నలబాటి లక్ష్మీనారాయణ, గెడ్డం సాయి బాబా, మీసాల సత్యనారాయణ, కొయ్యా వెంకట్రావు పాల్గొన్నారు.

దేవరపల్లి: దేవరపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయం వద్ద రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నియోజకవర్గ పార్టీ అభ్యర్థి మార్టిన్ లూథర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశం సాంకేతిక రంగాల్లో అభివృద్ధి చెందడానికి రాజీవ్ గాంధీ కృషేనన్నారు. ఐదంచెల పంచాయతీరాజ్ వ్యవస్థను ఏర్పాటు చేశారన్నారు. ఆయన ప్రధానియైన తరువాత దేశ ఆర్థిక వ్యవస్థ మరింత బలోపేతమైందన్నారు. కార్యక్రమంలో పీసీసీ ప్రధాన కార్యదర్శి జ్యేష్ట సతీష్‌బాబు, మండలాధ్యక్షుడు వెలగా రామకృష్ణ, నాయకులు రఫీ ఉల్లాబేగ్, మటపర్తి రామ్మోహనరావు, గన్నమని రామారాయుడు, పిట్టా రామారావు, చాపల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

నిడదవోలు: నిడదవోలులోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నియోజకవర్గ ఇన్‌చార్జి పెద్దిరెడ్డి సుబ్బారావు పూలమాలలతో నివాళులర్పించారు. కార్యక్రమంలో చిన్నం మురళీకృష్ణ, జీవీవీ సత్యనారాయణ, అగర్వాల హీరాలాల్, షేక్ కాశీమ్, షేక్ చిన జిలానీ పాల్గొన్నారు.



దేవరపల్లిలో రాజీవ్‌గాంధీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మార్టిన్ లూథర్



నిడదవోలులో నివాళులర్పిస్తున్న కాంగ్రెస్ నాయకులు

వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్లలో రాగివైరు చోరీలు

- తూర్పు, పశ్చిమ గోదావరి, కాకినాడ జిల్లాలకు చెందిన నలుగురి అరెస్టు
- 226 రాగి దిమ్మలు, వ్యాన్, రెండు బైక్‌లు స్వాధీనం



చోరీ సొత్తుతో వివరాలు వెల్లడిస్తున్న కొవ్వూరు డీఎస్పీ రామారావు

దేవరపల్లి, మే 21: దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద వాహన తనిఖీల్లో భాగంగా మంగళవారం 226 రాగి దిమ్మలను స్వాధీనం చేసుకున్నట్టు కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం దేవరపల్లి పోలీస్‌స్టేషన్ వద్ద కేసు వివరాలను వెల్లడించారు. అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం పెదపూడి గ్రామానికి చెందిన సుంకర సతీష్, కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరం గ్రామానికి చెందిన కొమ్మిరెడ్డి దుర్గ, నక్కా నాగేంద్రకుమార్, నెల్లూరి లోవరాజు కాకినాడ, పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి జిల్లాల్లోని వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రాత్రిళ్లు దొంగతనాలు చేస్తుంటారు. సుంకర సతీష్ పెదపూడిలో పాత ఇనుము వ్యాపారం చేస్తుంటాడు. నాగేంద్ర, దుర్గ, లోవరాజు ఇంటింటికీ వెళ్లి ఇనుప సామాన్లు కొనుగోలు చేస్తుంటారు. ఈ క్రమంలోనే వీరు ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగివైరును దొంగిలించేవారు. ఆ రాగివైరును సతీష్‌కు అమ్ముతుంటారు. సతీష్ వ్యాపారాన్ని విస్తరించి కొద్దికాలం కిందట తాడేపల్లిగూడెంలోని డంపింగ్‌యార్డు వద్ద షాపు తెరిచాడు. దొంగిలించిన రాగివైరును అందులోనే కరిగించి దిమ్మలుగా చేసి అమ్మడానికి తరలిస్తుంటారు. 120 వ్యవసాయ క్షేత్రాల్లో ట్రాన్స్‌ఫార్మర్‌లు పగలగొట్టి కాపర్‌వైరు దొంగలించారు. 226 రాగి దిమ్మలను ఆరుమూటల్లో పెట్టుకుని వ్యాన్లలో అమ్మకానికి విజయవాడ బయలుదేరారు. దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద ఎస్ఐ కె.శ్రీహరిరావు సిబ్బందితో వాహన తనిఖీలు చేస్తుండగా పట్టుబడ్డారు. నలుగురిని అరెస్టు చేసి, సుమారు రూ.6లక్షల విలువైన చోరీ సొత్తుతోపాటు మినీవ్యాన్, రెండు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నట్టు డీఎస్పీ రామారావు తెలిపారు. కార్యక్రమంలో సీఐ బాలసురేష్‌బాబు, రాజమండ్రి సీసీఎస్ ఇన్‌స్పెక్టర్ కే.రజనీకుమార్, ఎస్ఐ శ్రీహరిరావు పాల్గొన్నారు.

నయా మామిడి!

మార్కెట్లోకి కొత్త రకాలు

కడియం, మే 21 : కడియం నర్సరీ రైతులు విభిన్న మామిడి పండ్ల రకాలను పండిస్తున్నారు. బనానా, థాయిలాండ్ వైట్, మియాజాకీ తదితర రకాల మామిడి మొక్కలను తీసుకువచ్చి ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం కడియం నర్సరీల్లో ఈ సరికొత్త మొక్కలను పెంచుతున్నారు. కొత్తరకం మొక్కలను ప్రస్తుతం తోటలుగా వేసేందుకు, అలానే మార్కెటింగ్, నేల స్వభావం వంటి పరిస్థితులను ఆలోచించి రైతులు వీటిని పెంచడానికి ఉత్సాహం చూపుతున్నారు.



మియాజాకీ మామిడి



బనానా మేంగో



థాయిలాండ్ వైట్ మేంగో

పండూరి మామిడి

చూడడానికి ఈ మామిడి పండ్లు పిండెల్లాగా కనిపిస్తాయి. ఆకుపచ్చని మామిడిపండ్లపై చిన్నచిన్న చుక్కలు ఉంటాయి. తింటే గాని వీటి మధురం తెలియదు. మిగలముగ్గిన పండు తొక్క కూడా ఆకుపచ్చగానే ఉంటుంది. ధరలోనూ ప్రియమే.

ఆల్ఫాన్సా మామిడి

హైబ్రిడైజేషన్‌తో పుట్టుకొచ్చిన సరికొత్త మామిడి ఆల్ఫాన్సా. రైతులను ఆర్థికంగా నిలదొక్కేందుకు కూడా ఎంతో ఉపకరిస్తాయి. గాలి వానల సమయంలో రాలకుండా ఉండడం వీటి ప్రత్యేకత. తేనెలొలికే తియ్యదనం మరో ప్రత్యేకత. వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ.

బరామాస మామిడి

బరామాస ఏడాది పొడవునా కాస్తూ వేసవిలో అధికంగా కాయలు ఇస్తుంది. ఈ రకం మామిడి పండ్లు నిగనిగలాడుతూ పలకరించినట్లు ఉంటాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉండడం వీటి ప్రత్యేకత. పీచు పదార్థం ఎక్కువగా ఉండడంతో పాటు టెంకభాగం వరకు గుజ్జు ఉంటుంది.

కొత్తరకాల మొక్కలు

బనానా మామిడి

ఇతర దేశాల నుంచి తీసుకువచ్చి పెంచుతున్న ఈ మామిడి అరటిపండులా సన్నగా, పొడవుగా ఉంటుంది. టెంక సన్నంగా ఉంటుంది. ఈ మామిడి తింటుంటే జ్యూస్ తాగినంత మధురానుభూతి కలుగుతుందని నర్సరీ రైతు జానకీరామ్(నాని) తెలిపారు.

థాయిలాండ్ వైట్‌మామిడి

ఈ చెట్టు వేసిన 3, 4 ఏళ్లకే కాపు కొస్తాయని నర్సరీ రైతు చెబుతున్నారు. ఈ ఫలాన్ని ముక్కలుగా కోసుకుని ఆరగిస్తుంటారు.

వాటర్ యాపిల్స్

పోషకాలు మెండు



కడియం, మే 20: పుల్లపుల్లగా, తియ్యతీయగా ఉండే వాటర్ యాపిల్స్‌ను జంబోఫలం, గులాబీజామ్ అంటారు. వేసవి తీవ్రతకు కలిగే దాహార్తి నుంచి ఉపశమనం కలిగేందుకు చల్లని నీరు, మజ్జిగ, కొబ్బరిబొండాం, లస్సీలు, జ్యూస్‌లు వంటి వాటిని తాగుతుంటాం. అలానే వీటితో పాటు మినరల్స్, సీ-విటమిన్ పుష్కలంగా ఉండే వాటర్ యాపిల్స్ కూడా మనకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. కడియం నర్సరీలో వాటర్ యాపిల్స్ ఎరుపు, గ్రీన్, మల్టీకలర్ వంటి రంగుల్లో మనకు లభిస్తున్నాయి. వేసవిలో గుత్తులు, గుత్తులుగా కాసే ఈ వాటర్ యాపిల్స్‌లో మంచి పోషకాలు ఉండటంతో పాటు దాహార్తి నుంచి మనకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. వాహనాల్లో ప్రయాణించే సమయంలోను, ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలోను వీటిని వెంట తీసుకెళితే దాహార్తిని తీర్చే ఔషధంగా ఎంతో మేలు చేస్తాయని నర్సరీ రైతులు అంటున్నారు. ఈ చెట్టు పెరిగే కొద్దీ ఫలాలతో పాటు మంచినీడ కూడా ఇస్తుంది. వాటర్ యాపిల్స్ మొక్కలను వాణిజ్య పంటగా కూడా వేసుకుంటే మంచి లాభాలు ఉంటాయని. నల్లరేగడి భూములతో పాటు, ఎర్రనేలల్లో కూడా ఈ మొక్కలు బాగా పెరుగుతూ మంచి ఫలాలలను ఇస్తాయని నర్సరీ రైతులు చెబుతున్నారు.

ప్రశాంత ఎన్నికల కౌంటింగ్‌కు సహకరించాలి

డీఎస్పీ అంబికాప్రసాద్.. బొగ్గులదిబ్బ, జేగురుపాడులో కార్డన్ సెర్చ్



కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహిస్తున్న పోలీసు అధికారులు

కడియం, మే 21: ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేలా అంతా సహకరించాలని దక్షిణ మండల డీఎస్పీ ఎం.అంబికాప్రసాద్ అన్నారు. ఎస్పీ పి.జగదీష్ ఉత్తర్వుల మేరకు సౌత్‌జోన్ పరిధిలో రెండు రోజులుగా కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్లు జరుగుతున్నట్లు తెలిపారు. రాజమహేంద్రవరం టుటౌన్, ధవళేశ్వరం, కడియం ఇన్‌స్పెక్టర్లు వి.శ్రీనివాస్, వి.వినయ్‌మోహన్, బి.తులసీధర్ ఆయా పోలీస్‌స్టేషన్ల సిబ్బంది, కేంద్ర పారామిలటరీ బలగాలతో టుటౌన్ పరిధిలోని బొగ్గులదిబ్బ, కడియం మండలం జేగురుపాడు శివారు ప్రాంతాల్లో కార్డన్ సెర్చ్ నిర్వహించామని డీఎస్పీ చెప్పారు. తనిఖీల్లో నెంబర్ ప్లేట్లు లేని 10 మోటారుసైకిళ్లను, జేగురుపాడులో 10 విస్కీ బాటిళ్లను స్వాధీన పరుచుకుని స్టేషన్‌కు తరలించామన్నారు. విస్కీ బాటిళ్లతో పట్టుబడిన వ్యక్తిపై కడియం పీఎస్‌లో కేసు నమోదు చేశారన్నారు.

అమలులో పోలీస్ యాక్ట్ 30

పోలీస్ యాక్ట్ 30 అమలులో ఉందని డీఎస్పీ అంబికాప్రసాద్ తెలిపారు. ముందస్తుగా అనుమతులు లేకుండా ఊరేగింపులు, ప్రదర్శనలు, ర్యాలీలు, బహిరంగ సభలు నిర్వహించకూడదన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున అనుమతులు లేకుండా బాణసంచా తయారీ, అమ్మడం చేసేవారిపై చర్యలు తీసుకుంటామన్నారు. పెట్రోల్ బంక్‌ల్లో పెట్రోలు, డీజిల్‌లను లూజ్ బాటిళ్లు, క్యాన్లలో విక్రయించొద్దన్నారు. పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా ఉందని, శాంతిభద్రతల సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా కఠినచర్యలు తప్పవని డీఎస్పీ హెచ్చరించారు.

ఐటీఐలో నూరు శాతం సీట్ల భర్తీకి ప్రణాళిక

జిల్లా ఉపాధి కల్పన అధికారి హరిశ్చంద్ర ప్రసాద్

రాజమహేంద్రవరం రూరల్, మే 21: జిల్లాలో ప్రభుత్వ, ప్రవేట్ పారిశ్రామిక శిక్షణా సంస్థలలో నూరు శాతం సీట్ల భర్తీ చేసేవిధంగా పక్కా ప్రణాళిక తో పాటు సమన్వయ శాఖల సహకారం ఎంతో అవసరమని ఉపాధి కల్పన జిల్లా అధికారి కే హరిశ్చంద్ర ప్రసాద్ అన్నారు. మంగళవారం రూరల్ లోని బొమ్మూరు ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ కార్యాలయంలో జరిగిన సమన్వయ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ఐటిఐలో పాస్ అయిన విద్యార్థులకు పరిశ్రమల్లో ఉపాధి కల్పించే విధంగాను, స్వయం ఉపాధి పొందే విధంగాను, జిల్లా స్థాయిలో సమన్వయ కమిటీ పక్కా ముందస్తు కార్యచరణ ప్రణాళిక ఎంతో అవసరమన్నారు. జిల్లా స్థాయి సమన్వయ కమిటి సమావేశాన్ని రాష్ట్ర ఉపాధి కల్పన శిక్షణా శాఖ కార్యదర్శి , సంచాలకులు వారి ఆదేశాల మేరకు ఏర్పాట్లు చేయడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి , జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి, ఎల్‌డిఎం , ప్రభుత్వ ఐటిఐ ల కన్వీనర్లు, ప్రిన్సిపాల్, జిల్లా ప్రవేట్ ఐటిఐల అధ్యక్షులు ,కార్యదర్శులు విద్యార్థులు పాల్గొన్నారు.

జీవవైవిధ్యాన్ని కాపాడుకుందాం

కడియం, మే 21: నానాటికీ పెరుగుతున్న కాలుష్యం నేపథ్యంలో జీవవైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని బాధ్యత సేవా సంస్థ అధ్యక్షులు గిరజాల బాబు అన్నారు. జీవవైవిధ్య దినోత్సవం సందర్భంగా జాతీయ పర్యావరణమిత్ర చిలుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించిన సదస్సులో ఆయన బాబు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యంతో ఎన్నో జీవులు ఉనికిని కోల్పోయాయన్నారు. ఏపీ జీవవైవిధ్య మండలి ప్రచురించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. జీవవైవిధ్యం హరించిపోతే భవిష్యత్తులో భూగోళంపై మానవ మనుగడకు హాని ఏర్పడుతుందని శ్రీనివాసరావు అన్నారు. కార్యక్రమంలో గళ్లా చిరంజీవి, పుట్టా శ్రీనివాసరావు, వేదాంతం నాని, షన్నమిరాజు వీర్రాజు, అడపా సుబ్రహణ్యం, మలసాని గోవిందు, చింతాడ హరినాయుడు, వేదులశాస్త్రి పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు

యువరాజ్‌మాల్ వై.స్క్రీన్1	లవ్‌గురు
వై.స్క్రీన్2	ఫ్యామిలీ స్టార్
దేవిశ్రీ(గాయత్రి)	మంజుమ్మల్ బాయ్స్
అనన్య	డీజే టిల్లు-2

నిడదవోలు

వీ మ్యాక్స్	గాడ్జిల్లా వర్సెస్ కాంగ్
రాధాకృష్ణ	ఆ ఒక్కటి అడక్కు
శ్రీగణపతి	గీతాంజలి మళ్లీ వచ్చింది

దేవరపల్లి

శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్
శ్రీరామ్ సినీ మ్యాక్స్	ఫ్యామిలీ స్టార్

నల్లజర్ల

శ్రీలక్ష్మి మల్టీప్లెక్స్ స్క్రీన్1	భీమా
స్క్రీన్ 2	ప్రేమలు
శ్రీనివాస	గామి